

మహా శివరాత్రికి 250 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా పుణ్యక్షేత్రాలు, దర్శనీయస్థలాలకు ఆర్టీసీ 250 ప్రత్యేక బస్సులు నడపనుంది. అప్పికొండ సోమేశ్వరాలయానికి గాజువాక నుంచి 60, సింధియా నుంచి 10, స్టీల్‌సిటీ నుంచి 30, దువ్వాడ 10, అగనంపూడి నుంచి 10, రామకృష్ణ బీచ్‌కు పెందుర్తి నుంచి 40, కొత్తవలస, గాజువాక నుంచి 60, ఉక్కునగరం నుంచి 10 నడుపుతారు. గాజువాక నుంచి పంచదార్ల, కల్యాణపులోవకు 20 బస్సులు నడపనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. సముద్ర స్నానాలకు వీలుగా రామకృష్ణాబీచ్, అప్పికొండకు గురువారం బస్సులు నడుపుతామన్నారు.

విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్



నగరంలో చాపకింద నీరులా స్మగ్లర్ల హవా

ఇతర రాష్ట్రాల నుంచి రహస్యంగా దిగుమతి

- ప్రత్యేక కోడింగ్ ద్వారా గుట్టుగా విక్రయాలు
- తాజాగా సాగర్‌నగర్ వద్ద బ్రౌన్‌షుగర్ విక్రయిస్తూ పట్టుబడిన ఒడిశా వాసి
- డ్రగ్స్ ముఠాల సమాచార సేకరణలో విఫలమవుతున్న పోలీసులు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలో డ్రగ్స్ విక్రయం, వినియోగం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఒడిశా, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ని రహస్యంగా దిగుమతి చేస్తున్నారు. వాటిని ప్రత్యేక కోడింగ్ ద్వారా అప్పటికే తమను సంప్రతించిన వారికి విక్రయిస్తున్నారు. డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగంపై పోలీసులు పటిష్ఠ నిఘా పెట్టినప్పటికీ స్మగ్లర్లు చిక్కకుండా తమ వ్యవహారాలను చక్కబెట్టేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల బ్రౌన్‌షుగర్ విక్రయిస్తూ ఒడిశాకు చెందిన వ్యక్తి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది.

నగరంలో గంజాయి రవాణా, విక్రయం, వినియోగం సాధారణ విషయంగా మారిపోయింది. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట గంజాయి పట్టుబడుతూనే ఉంది. అదే సమయంలో కొకైన్, బ్రౌన్‌షుగర్, ఎండీఎండీ పౌడర్ వంటి సింథటిక్ డ్రగ్స్ వినియోగం చాపకిందనీరులా సాగుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రంలో అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందడంతో పాటు కాస్మోపాలిటన్ సంస్కృతి విస్తరిస్తుండడంతో సింథటిక్ డ్రగ్స్ వినియోగం కూడా అదేస్థాయిలో పెరుగుతోందనే అభిప్రాయం పోలీసు అధికారులు సైతం వ్యక్తం చేస్తున్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనం కావడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. మరోవైపు క్రైమ్ రేట్ పెరగడానికి కూడా ఇది కారణంగా మారుతోంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్‌కు అడ్డుకట్టవేయడంతోపాటు డ్రగ్స్ స్మగ్లర్లు, వినియోగించేవారు (పెడ్లర్స్)పై పోలీసులు నిఘా పెట్టారు. గంజాయితో పాటు డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగం జరిగితే తక్షణం తమకు సమాచారం అందేలా ప్రత్యేక వ్యవస్థను ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ అభివృద్ధి చేసుకున్నారు. అయినప్పటికీ తమిళనాడు, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి గుట్టుగా సింథటిక్ డ్రగ్స్ దిగుమతి జరుగుతోందని సమాచారం. ఆయా రాష్ట్రాల నుంచి కొంతమంది వ్యక్తులు సింథటిక్ డ్రగ్స్‌తో నగరానికి బస్సులు, రైలుమార్గాల్లో చేరుకుంటున్నారని చెబుతున్నారు. సింథటిక్ డ్రగ్స్ చిన్నపాటి పరిమాణంలో ఉంటాయి కాబట్టి లగేజీ బ్యాగుల్లోనూ, ప్యాంటు జేబుల్లోనూ దాచేందుకు అవకాశం ఉంది. దీనివల్ల పోలీసులకు పక్కా సమాచారం ఉంటే తప్ప అలాంటి వారిని గుర్తించడం, పట్టుకోవడం సాధ్యం కాదు. దీనిని అవకాశంగా తీసుకుని నగరానికి చెందిన పలువురు ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుని, తమకు పరిచయస్తులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఇటీవల నగరానికి చెందిన రాంకీ అనే యువకుడు గోవా, బెంగళూరు నుంచి స్నేహితుల ద్వారా 24.5 గ్రాముల కొకైన్‌ను ప్రైవేటు బస్సులో నగరానికి తీసుకురాగా, ఇంటెలిజెన్స్ అధికారుల సహాయంతో నగర పోలీసులు వారిని రామాటాకీస్ వద్ద అరెస్ట్ చేసి, కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. రుషికొండ వద్ద చెన్నైకు చెందిన మరో యువకుడు ఎండీఎంఏ పౌడర్‌తోపాటు ఎల్‌డీఏ చిప్స్‌ను ఇతరులకు విక్రయించే క్రమంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తాజాగా ఒడిశాకు చెందిన వ్యక్తి రెండు గ్రాముల

... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో కుమ్ములాట

- అర్ధంతరంగా కార్యవర్గం రద్దు
- అవినీతి ఆరోపణలే కారణం?



విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘంలో కుమ్ములాటలు తారస్థాయికి చేరుకున్నాయి. దీంతో మరో ఆరునెలలు కాలపరిమితి ఉండగానే సంఘం కార్యవర్గం మూకుమ్మడిగా రాజీనామా చేసింది. కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు పెద్దలు జీవీఎంసీ అకౌంట్స్ విభాగంలోని అధికారులతో మిలాఖత్ అయి ఇతర కాంట్రాక్టర్లకు అన్యాయం చేశారంటూ కాంట్రాక్టర్లు బహిరంగ ఆరోపణలకు దిగారు. ఇటీవల ముస్లిం తాటిచెట్లపాలెంలోని షాదీఖానాలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా సంఘం పెద్దలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్లకు ఈఎండీలను రాబట్టడం, పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్య క్రమంలో బిల్లులు చెల్లింపు జరిగేలా చూడాల్సిన సంఘంలోని కొందరు పెద్దలు అకౌంట్స్ విభాగంలోని అధికారులతో కలిసి తమ బిల్లులను అడ్డదారిలో ముందుగానే తీసుకున్నారని సభ్యులు ఆరోపించారు. ఇతర కాంట్రాక్టర్ల నుంచి అధికారులకు నాలుగుశాతం కమీషన్ ఇప్పించి పెత్తనం చెలాయించారని విమర్శలు గుప్పించారు. యూనియన్‌లో ఒకే సామాజికవర్గానికి పదవులు కట్టబెట్టి, ఇతర సామాజికవర్గాలకు ఐదుశాతం పదవులను మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు తప్పుకోవడంతో కార్యవర్గం రద్దయింది. యూనియన్‌లో గతంలో పెత్తనం చేసిన కొంతమంది కాంట్రాక్టర్లే అస్మదీయులను ఎగదోసి తమను చెడ్డగా చిత్రీకరించేలా చూస్తున్నారంటూ ఇటీవల రద్దైన కార్యవర్గంలోని కొందరు పెద్దలు ప్రత్యారోపణలు చేస్తుండడంతో కాంట్రాక్టర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒకరిపై ఆరోపణలు చేసేందుకు మరొకరు పత్రికా సమావేశాలు పెట్టేందుకు సిద్ధపడుతున్నట్టు సమాచారం.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

85.04 శాతం మంది అభ్యర్థులు హాజరు

ఉదయం 9,391, మధ్యాహ్నం 9,370 మంది..



ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో బారులు తీరిన అభ్యర్థులు

- విశాఖ జిల్లాలో 16 కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు
- పరీక్ష తీరును పరిశీలించిన కలెక్టర్, జేసీ, సీపీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కొమ్మాదిలో ఓఅభ్యర్థి పరీక్ష రాస్తూ తీవ్ర అస్వస్థతకు గురవడం, ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష గదులు గుర్తించడంలో కొందరు అభ్యర్థులు గందరగోళానికి గురవడం మినహా ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. పరీక్ష వాయిదా వేయాలని రెండు, మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న కొందరు అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు వస్తారన్న సమాచారంతో నగరంలో అన్ని కేంద్రాల వద్ద పోలీసులు విస్తృతస్థాయిలో బందోబస్తు ఏర్పాటుచేశారు.



ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలో పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

అభ్యర్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు నిర్దేశిత సమయం కంటే ముందుగానే చేరుకున్నారు. ఉదయం 6.30 గంటలకు లైజన్ అధికారులు పరీక్షల మెటీరియల్‌తో కేంద్రాలకు చేరుకున్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పోలీసు భద్రత మధ్య ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించిన పరీక్షకు ఉదయం ఎనిమిదిగంటల తరువాత, మధ్యాహ్నం మూడు నుంచి జరిగే పరీక్షకు రెండు గంటల తరువాత అభ్యర్థులను లోపలకు అనుమతించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యర్థులు క్యూకట్టారు. ప్రతి ఒక్కర్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం అనుమతించారు. అయితే ఇంజనీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో ఏర్పాటుచేసిన గదులు గుర్తించేలా నిర్వాహకులు సైన్‌బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో అభ్యర్థులు గందరగోళానికి గరయ్యారు. జిల్లాలోని 16 కేంద్రాల్లో పరీక్ష రాసేందుకు మొత్తం 11,030మంది దరఖాస్తుచేయగా ఉదయం 9,391 మంది (85.14శాతం), మధ్యాహ్నం 9,370 (84.95శాతం)హాజరయ్యారు. మొత్తం 85.04 శాతం అభ్యర్థులు హాజరైనట్టు అధికారులు తెలిపారు. ఉదయం పరీక్ష రాసిన వారిలో 21 మంది మధ్యాహ్నం పరీక్షకు హాజరుకాలేదు. కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం పరీక్ష రాసిన భీమిలి మండలం రేఖవానిపాలేనికి చెందిన పి.గంగరాజు మధ్యాహ్నం పరీక్షకు హాజరైన అరగంట తరువాత వాంతులు చేసుకోవడంతో ఇన్విజిలేటర్, చీఫ్‌సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. అతడికి రక్తపోటు తగ్గడంతో వెంటనే ప్రథమ చికిత్స చేసి, సమీపంలోని గాయత్రి వైద్య కళాశాలకు తరలించారు. కాగా నాగరాజు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదిలావుండగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షను కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, సీపీ డాక్టర్ శంఖబ్రతబాగ్చి తనిఖీ చేశారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో న్యూక్లాస్‌రూమ్ కాంప్లెక్స్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ప్రిజం డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరిశీలించారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్న తీరును డీఆర్వో భవానీశంకర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించారు. పోలీసులు అన్ని కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష వాయిదా వేయాలని మూడు రోజులుగా ఆందోళన చేసిన అభ్యర్థులు ఆదివారం కేంద్రాలకు రాకపోవడంతో పోలీసులు, జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

- పార్టీ కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ



కన్నబాబును అభినందిస్తున్న గుడివాడ అమర్‌నాథ్, పార్టీ నాయకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవిలో కొనసాగిన విజయసాయిరెడ్డి ఇటీవల వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో పార్టీ అధిష్ఠానం కన్నబాబును నియమించిన విషయం తెలిసిందే. కాగా ఊరేగింపుగా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న కన్నబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,

... మిగతా 6వ పేజీలో

ఇసుక రవాణాలో అక్రమాలు

నకిలీ బిల్లులతో నగరానికి చేరుతున్న వైనం

- శ్రీకాకుళం రీచ్‌ల సిబ్బందితో లారీ డ్రైవర్ల మిలాఖత్
- రెండు నెలల్లో పదుల సంఖ్యలో లారీలను పట్టుకున్న గనులశాఖ
- అధికారుల పర్యవేక్షణా లోపమే కారణం



నకిలీ వే బిల్లుతో పట్టుబడిన ఇసుక లారీ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

ఇసుక వినియోగంలో ప్రభుత్వం పూర్తి వెసులుబాటు కల్పించినా కొందరు లారీ డ్రైవర్లు నకిలీ వే బిల్లులతో నగరానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. బిల్లులపై ఉన్న సమయంతో సంబంధం లేకుండా నదిలో రీచ్‌ల వద్ద పనిచేసే కొందరు సిబ్బంది, లారీ డ్రైవర్లు మిలాఖత్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో గత రెండుమూడు నెలలుగా నకిలీ వేబిల్లులతో వందల లారీల ఇసుక నగరానికి చేరింది.

శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నదుల్లో కొన్నిచోట్ల రీచ్‌లు గుర్తించి ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణ బాధ్యత అప్పగించారు. నామమాత్రపు రుసుం, నిర్వహణ, లోడింగ్‌వ్యయం పేరిట టన్నుకు రూ.200 వరకు మాత్రమే వసూలు చేస్తున్నారు. దీనికి వే బిల్లులు జనరేట్‌చేసి లారీ డ్రైవర్లకు అందజేస్తారు. బిల్లుపై లారీ పేరు, నంబరు ,లారీ బయలుదేరే సమయం నుంచి ఎక్కడికి రవాణా చేస్తారు? అన్న వివరాలు నమోదుచేస్తారు. ఒక రీచ్‌లో రోజువారీ తవ్వకాలు, లోడింగ్ వివరాలు, వాహనాల నంబర్లు గనులశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఒక రీచ్‌లో ఎంత ఇసుక తవ్వకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది?అ న్నది కూడా వెబ్‌సైట్‌లో ఉంటుంది. ఉదాహరణకు ఒక రీచ్‌లో రెండు లక్షల టన్నుల ఇసుక తవ్వకానికి ప్రభుత్వం అనుమతి ఇస్తే... గనులశాఖ వెబ్‌సైట్‌లో రెండు లక్షల టన్నుల వరకు మాత్రమే వేబిల్లులు జనరేట్ అవుతాయి. అంతకుమించి తవ్వినా దానికి సంబంధించి బిల్లులు జనరేటయ్యే అవకాశంలేదు. ప్రతి రీచ్‌లో ఎంత మేర తవ్వకానికి అనుమతి ఉంది? ఎంత మేర తవ్వి రవాణా చేస్తున్నారు... సమయం గనులశాఖ అధికారులు తెలుసుకునే వెసులబాటు కల్పించారు. అయితే రీచ్‌ల వద్ద కొందరు సిబ్బంది, లారీ డ్రైవర్లు కుమ్మక్కై ప్రభుత్వం ఇచ్చిన అనుమతికి మించి ఇసుక తవ్వేసి రవాణా చేస్తుంటారు. దీనికి మాత్రం వే బిల్లుల

... మిగతా 6వ పేజీలో

ఫుడ్ లేబొరేటరీ సేవలందేనా?

- గత ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఇప్పటికీ అందుబాటులోకి రాని సేవలు
- నిరుపయోగంగా పడి ఉన్న రూ.15 కోట్ల పరికరాలు
- బీజేపీ నేతలు నిరసన తెలిపినా పట్టించుకోని ఉన్నతాధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి):

ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన స్టేట్ ఫుడ్ లేబొరేటరీ ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. రాష్ట్ర విభజన తరువాత స్టేట్ ఫుడ్ ల్యాబ్‌ను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసింది. దీనిని నగరంలోని పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. లేబ్ ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు



పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫుడ్ లేబొరేటరీ భవనం

రూ.30 కోట్లు ఖర్చు చేశాయి. రెండేళ్ల కిందట భవన నిర్మాణం పూర్తయింది. గత ఏడాది ఫిబ్రవరి 25న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు కేటాయించిన లేబ్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఆయన ప్రారంభించడానికి కొన్ని రోజులు ముందే సుమారు రూ.10 కోట్ల విలువైన అత్యాధునిక పరికరాలను ఇక్కడ ఏర్పాటుచేశారు. సాధారణంగా ప్రారంభోత్సవం జరిగిన తరువాత సేవలు అందుబాటులోకి రావాలి. కానీ ఇప్పటికీ ప్రారంభించకపోవడం గమనార్హం.

బీజేపీ ఆందోళనలు చేసినా...

ఫుడ్ లేబొరేటరీ అందుబాటులోకి రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజారోగ్య పరిరక్షణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని బీజేపీ నాయకులు నిరసన తెలియజేశారు. తక్షణమే ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేబ్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం, అత్యాధునిక పరికరాలు, కెమికల్స్ నిరుపయోగంగా మారాయి. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికీ హైదరాబాద్‌లోనే..

విభజనకు ముందు స్టేట్ ఫుడ్ లేబ్ హైదరాబాద్‌లో ఉంది. రాష్ట్రంలోని అన్ని

... మిగతా 6వ పేజీలో

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందజేస్తున్న అధికారులు

సింహాచలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన నూకాలు సూర్యకాంతం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,01,116లను నగదు రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల విభాగపు ఏఈవో వెంపలి రాంబాబుకు ఆదివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం కలిపించి శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జూట్ కార్మికుల పింఛను రూ.9 వేలు చేయాలి

తగరపువలస, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు అందిస్తున్న పింఛన్ల మొత్తాన్ని పెంచాలని కోరుతూ చిట్టివలస జూట్‌మిల్లు పింఛనుదారులు డిమాండ్ చేసింది. పింఛనుదారుల సంఘ అధ్యక్షుడు కానూరి రాంబాబు అధ్యక్షతన ఆదివారం సీపీఐకార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కేంద్ర మంత్రి మాన్సిక్ మాండ్యా ప్రకటనకు అనుగుణంగా ప్రభుత్వం ప్రకటన చేయాలనిడిమాండ్ చేసింది. కనీసం రూ.9 వేలకు పెంచాలని కోరారు. సమావేశంలో జూట్‌మిల్లు పింఛనుదారుల సంఘం కార్యదర్శి దామోదర బావాజీ సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, చిల్ల అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి జాగరణ స్నానాలకు ఏర్పాట్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి జాగరణ స్నానాలు చేసే భక్తులు కోసం సాగర్‌నగర్ తదితర బీచ్‌లలో జీవీఎంసీ విద్యుత్ దీపాలను ఆదివారం ఏర్పాటు చేసింది. శివరాత్రి రోజు భక్తులు జాగరణ చేసి తెల్లవారు జామున సముద్ర స్నానాలకు వేలాది మంది తీరాలకు వస్తారు. చీకటిలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బీచ్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఆ రోజు స్వచ్ఛంద సంస్థలు వారికి తోచిన సహాయం భక్తులకు చేస్తుంటారు.



పొలాల్లోకి పల్టీలు కొట్టిన కారు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బోయపాలెం-బీచ్ రోడ్డు నగరపాలెం రహదారిలో అతివేగంగా ప్రయాణిస్తున్న ఓ కారు అదుపు తప్పి బోల్తా పడి లోతట్టుగా ఉన్న పొలాల్లోకి పల్టీలు కొట్టింది. కాగా కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు తగలలేదని తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటన్నరప్పుడు ఈ ప్రమాదం జరగడం, ఆ సమయంలో పొలంలోని రైతులంతా ఇళ్లకు వెళ్లడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. కాగా కారు బాగా దెబ్బతింది. ఈ విషయమై పోలీసులతో మాట్లాడగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తహశీల్దార్ పి.రామారావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడి మహాత్మా గాంధీ ఫిషర్‌మెన్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రానికి సంబంధించి మొత్తం ఓటర్లు 261 మంది ఉండగా.. వీరిలో 157 మంది పురుషులు, 104 మంది మహిళలు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆనందపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-1999లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఒకరికొకరు ముచ్చట్లు చెప్పుకుంటూ.. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి హెచ్ఎం పట్నాయక్, ఉపాధ్యాయులు అప్పలరాజు, గాయత్రి, ప్రసాద్, నారాయణమూర్తి, శ్రీనివాసరావు, శేషగిరిరావులు వారిని ఆశీర్వదించారు.

ఘనంగా బంగారమ్మ తీర్థం

సింహాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అడవివరం, తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత, సింహాద్రి అప్పన్న సోదరి బంగారమ్మతల్లి తీర్థాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారులు సత్యవాణి, పద్మనాభం భక్తులకు సదుపాయాలు కల్పించారు.

రైతులకు అండగా ఐడీఎస్‌ఏపీ

» ఎండాడ వద్ద ఐదెకరాల్లో కార్యాలయం ఏర్పాటుకు స్థల కేటాయింపు
» సంస్థ డైరెక్టర్ ఆచార్య గలాబ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐడీఎస్‌ఏపీ డైరెక్టర్ గలాబ్

మధురవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అండగా ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐడీఎస్ఏపీ) పరిశోధనలు చేస్తోందని ఆ సంస్థ డెరెక్టర్ ఆచార్య ఎస్.గలాబ్ తెలిపారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ సంస్థ హైదరాబాద్‌లో ఉండేదని, రాష్ట్ర విభజన తరువాత ఇక్కడ ఏర్పాటైందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య రొక్కం రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో సంస్థ మనుగడ ప్రారంభమైందని గలాబ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఆధారంగా రైతులకు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వాలనే ప్రాజెక్టు ప్రస్తుతం కొనసాగిస్తున్నామన్నారు. అన్నదాతలకు సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడి, చీడపీడలు, భూసార పరీక్షలు తదితర వాటిపై క్షేత్రస్థాయిలో తమ సంస్థ బృందాలు పరిశోధనలు చేసి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్, రబీ, లతో పాటు ఖరీఫ్, రబీ కలపి పంటలకు సంభందించి ప్రతీఏటా మూడు నివేదికలను తమ బృందం సభ్యులు అధ్యయన పత్రాలు వ్యవసాయశాఖ అధికారులకు అందిస్తుందన్నారు. వాటి ఆధారంగా సేద్యం చేస్తే రైతులకు ఆర్థికంగా కలసి వస్తుందని గలాబ్ వివరించారు.తమ సంస్థ కార్యకలాపాలు కోసం నిధులు, భూ వనరులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుః ఇటీవల విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని తెలిపినట్టు గలాబ్ చెప్పారు. ఎండాడ సర్వే నంబరు 179/6లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని (దిశ పోలీస్‌స్టేషన్ పక్కన) ప్రభుత్వం ఐడీఎస్ఏపీకి కేటాయించిందని తెలిపారు. భూమి స్వాధీన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు.

25న ఏయూలో సదస్సు

సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆచార్య రొక్కం రాధాకృష్ణ జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా సెమినార్లు ఏర్పాటు నిర్వహించామని, ఇందులో భాగంగా మంగళవారం ఆంధ్రాయూనివర్శిటీలోని డాక్టర్ వీఎస్ మూర్తి ఆడిటోరియంలో సదస్సు నిర్వహించనున్నట్టు గలాబ్ తెలపారు ఈ సదస్సులో మాజీ ఆర్‌బీఐ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు సాయంత్రం నాలుగు గంటలకు 'డైలిమ్మాస్ ఇన్ సెంట్రల్ బ్యాంకింగ్ రిఫ్లెక్షన్స్ ఆన్ హౌ ది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కనెక్ట్స్ విత్ పీపుల్స్ ఎవ్రిడే లైఫ్' అనే అంశంపై ప్రసంగిస్తారని గలాబ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సంస్థ ఓఎస్‌డీ ఆచార్య జె.రామునాయుడు, సీనియర్ కన్సల్టెంట్ ఆచార్య సి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మార్చి 27 నుంచి నూకాలమ్మ ఉత్సవాలు


ఉత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి గ్రామదేవత శ్రీనూకాలమ్మ తల్లి ఉత్సవాలు మార్చి 27 నుంచి 30వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సమావేశమైంది. ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ మార్చి 27న తోలేళ్ల ఉత్సవం, 28న అనుపు ఉత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 29న పాపమ్మ పేరంటాలు, కొత్త అమావాస్య, 30న దుడ్డు అచ్చియ్యమ్మ పేరంటాలు అమ్మవార్ల ఉత్సవాలు, ఉగాది ఘనంగా జరుపుతాయన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి వై.హరి, కోశాధికారి పి.ఎర్రయ్యరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వినోద్ కుమార్, కో-ఆర్డినేటర్ జి.సన్యాసిరావు, ఆలయ పూజారి సీహెచ్ సత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు


నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులు

మధురవాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా పర్యాటక కేంద్రం మధురవాడ శిల్పారామంలో ఆదివారం నగరానికి చెందిన సుధారాణి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. 'గణనాయక..' కీర్తనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పుష్పాంజలి, 'గరుడగమన..', 'హిమగిరితనమే..' 'రామరామతారకం..', 'హనుమాన్ చాలీసా..' తదితర కీర్తనలకు కళాకారులు నృత్యాలతో అలరించారు. సుధారాణి నృత్యదర్శకత్వంలో కార్తీక్, హవీష్, వర్ష, కుందన ప్రియ, సాయినిధి, పార్థునారాయణ, భువన, గీతాశ్రీ ప్రణవరుద్ర పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి


తీరంలో సేద తీరుతున్న సందర్శకులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : భీమిలి సాగరతీరం ఆదివారం సాయంత్రం సందర్శకులతో సందడిగా మారింది. భీమిలి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నగరం నుంచి, విజయనగరం, శ్రీకాకుళం, ఎస్.కోట ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో సాగర తీరం కిటకిటలాడింది. పలువురు సందర్శకులు కడలి కెరటాలలో జలకాలాడారు. ఇసుకతిన్నెలపై బీచ్‌లో సేదతీరుతూ సరదాగా గడిపారు. సెల్ఫీలు, ఫోటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.


కెరటాల్లో కేరింతలు కొడుతూ..

లారీని ఢీకొన్న బస్సు: ఐదుగురికి తీవ్ర గాయాలు

» కుంభమేళాకు వెళ్తుండగా ప్రమాదం



లారీని ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

ఆనందపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి గండిగుండం సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలైనట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఉత్తరప్రదేశ్ కుంభమేళాకు 35 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. శనివారం రాత్రి విజయవాడ కనకదుర్గమ్మను భక్తులు దర్శించుకున్నాక బస్సు బయలుదేరగా.. ఆదివారం తెల్లవారుజామున గండిగుండం వద్దకు వచ్చేసరికి డ్రైవర్ వీరయ్య నిద్రమత్తులోకి జారుకోవడంతో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొన్నాడు. దీంతో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. బస్సులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వారికి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సీఐ వాసునాయుడు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టారు. ప్రయాణికురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ముదిమి వయసులో.. తరగతి గదిలో...

60 ఏళ్ల తరువాత కలుసుకున్న అలనాటి విద్యార్థులు

» సెయింట్ ఆంథోనీ పాఠశాల వేదిక




సెయింట్ ఆంథోని పాఠశాలలో కళా వేదికపై పూర్వ విద్యార్థులు. (ఇన్‌సెట్లో) నాడు తాము చదువుకున్న తరగతి గదిలో..

మహారాణిపేట , ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల కిందట కలిసి చదువుకున్న స్నేహితులు.. ఇప్పుడు ఆ పాఠశాలలోనే కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. విశాఖపట్నంలో సుప్రసిద్ధ సెయింట్ ఆంథోని పాఠశాలలో ఆదివారం ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. మహారాణిపేటలో ఉన్న సెయింట్ ఆంథోని పాఠశాలలో 1965లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 60 ఏళ్లు నిండిన సందర్భంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు కూడా అందరికీ లేవు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఒక్కరొక్కరుగా చిరునామాలు, సెల్‌ఫోన్ నంబర్లు సేకరించి, వాట్సాప్ గ్రూపును ఏర్పాటుచేసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన సుమారు 40 మంది విశాఖ వచ్చి, ఆదివారం సెయింట్ ఆంథోని పాఠశాలలో కలుసుకున్నారు. అందరి వయసు ఇంచుమించు 75 సంవత్సరాలు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. సంతోషంతో ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. నాడు చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగారు. కొద్దిసేపు చిన్నపిల్లలుగా మారిపోయారు. అప్పటి సంగతులు, విశేషాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత స్థితిగతులు, పిల్లలు, వారి కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. వృద్ధాప్యంతో మరణించిన తోటి స్నేహితులను తలచుకున్నారు. నాడు వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఇప్పుడు జీవించి లేకపోయినా, ఈ పాఠశాలలో పనిచేసి రిటైరైన ఓ ఉపాధ్యాయుడిని ఆహ్వానించి సన్మానించారు. అందరూ కలిసి మధ్యాహ్న భోజనం ఆరగించారు. గ్రూపు ఫొటోలు దిగి సరదాగా గడిపారు.

పుష్కరిణిని శుభ్రం చేసిన నిరంకారీ సభ్యులు


పుష్కరిణి వద్ద సేకరించిన చెత్తను బ్యాగులో వేస్తున్న ప్రతినిధులు, వలంటీర్లు

సింహాచలం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ జలం-స్వచ్ఛ మనసు కార్యక్రమంలో భాగంగా నగరానికి చెందిన సంత్ నిరంకారీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సింహాచల వరాహనారసింహుని పుష్కరిణి వద్ద పరిశుభ్రత ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా సుమారు మూడు గంటల పాటు శ్రమించి వరాహ పుష్కరిణిలో చేరిన చెత్త, వ్యర్థాలను తీసివేయడంతో పాటు పుష్కరిణి పరిసరాల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సంత్ నిరంకారీ సేవాదళ్‌కు చెందిన ప్రతినిధులు, సుమారు రెండు వందల మంది సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు. సద్గురు బాబా హరదేవ్‌సింగ్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు సంత్ నిరంకారీ సేవాదళ్ క్షేత్రీయ సంచాలకులు రవి, రాజ్వీర్, రాము తెలిపారు.

వైభవంగా అప్పన్న కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధన సేవలను యథావిధిగా పూర్తి చేశాక ఉభయ దేవేరులతో పాటు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామా లతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించాక శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఇసుక రవాణాలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాసెస్ జరగదు. కానీ తప్పుడు మార్గంలో వెళ్లి నకిలీ వే బిల్లులు తయారుచేసి విశాఖకు ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు తనిఖీల సమయంలో నకిలీ వేబిల్లులు గుర్తుపట్టలేకపోవడంతో డ్రైవర్లు వందల లారీల నకిలీ వేబిల్లులతో ఇసుక తోలేశారు. కేవలం గనులు శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తే మాత్రమే నకిలీ వే బిల్లులు గుర్తించి పట్టుకుంటున్నారు. ఇలా రెండు నెలల్లో పదుల సంఖ్యలో నకిలీ వేబిల్లులతో లారీలు పట్టుకుని జరిమానా విధించారు.

దాడులపై ముందస్తు సమాచారం

గనులశాఖ అధికారులు దాడులు చేస్తారన్న విషయం ముందుగానే తెలుసుకుంటున్న లారీ డ్రైవర్లు అప్రమత్తమై రీచ్‌ల వద్దే ఉండిపోతున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు దారి పొడవునా ప్రతిరోజూ గనులశాఖ, విజిలెన్స్ అధికారులు లారీలు తనిఖీ చేయడం సాధ్యం కాదు. అందువల్ల దాడులు చేయని రోజుల్లో ఎక్కువగా నకిలీ బిల్లులతో ఇసుక నగరానికి తరలిస్తున్నారు. నదులకు ఆనుకుని కొన్ని గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వి పొలాలు, కళ్లాల్లో నిల్వచేస్తున్న ఇసుకను కొందరు కొనుగోలుచేసి నకిలీ వేబిల్లులతో విశాఖకు తీసుకువస్తున్నారు.

నగరంలో రిటైల్ వ్యాపారులు, బిల్డర్లకు ఇసుక సరఫరాచేసే కొందరు తమకు తెలిసిన లారీ డ్రైవర్ల ద్వారా నకిలీ వేబిల్లుల బాగోతం నడుపుతున్నారు. ఇసుక తరలింపునకు నామమాత్రపు రుసుం మాత్రమే వసూలు చేసే వీలుంది. అది కూడా రీచ్‌ల నిర్వహణకు మాత్రమే తీసుకుంటున్నారు. అయినా కొందరు సిబ్బంది రీచ్ నిర్వాహకులకు టోపీ పెట్టి లారీ డ్రైవర్లతో మిలాఖత్ అయి ఇసుక తరలిస్తున్నారు. ఇటువంటి అక్రమాలకు తెరదించాలంటే అన్ని శాఖలతో బృందాలను ఏర్పాటుచేసి నిరంతరం నిఘా ఉంచాలని గనులశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్

... 5వ పేజీ తరువాయి

బ్రౌన్‌షుగర్‌ను సాగర్‌నగర్ వద్ద వేరొకరికి అందజేసే ప్రయత్నంలో టాస్క్‌ఫోర్స్, ఆరిలోవ పోలీసులు దాడిచేసి అతడ్ని అదుపులోకి తీసుకుని, బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా డ్రగ్స్‌తో పోలీసులకు పట్టుబడినవారు కొద్దిమందే ఉన్నప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న వారి సంఖ్య నగరంలో భారీగా ఉంటుందని పోలీసులే చెబుతుండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ప్రత్యేక కోడింగ్‌తో సరఫరా, విక్రయం

సింథటిక్ డ్రగ్స్‌ను ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొచ్చేవారు వాటిని ప్రత్యేక కోడింగ్ ద్వారా ఇతరులకు అందజేస్తున్నారు. సింథటిక్ డ్రగ్స్‌ను నగరానికి దిగుమతిచేసుకునేవారికి, ఇతర రాష్ట్రాల్లో వాటిని సరఫరాచేసేవారికి ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం తమకు కావాల్సిన సరుకు వివరాలను సరఫరాదారుడికి చెబితే, సుపారీకి పనిచేసే కొరియర్‌ల ద్వారా నగరానికి పంపిస్తున్నారు. కొరియర్‌లకు కూడా నగరంలోకి వచ్చినంతవరకు ఎవరికి వాటిని చేరవేయాలనేది తెలియదు. నగరానికి చేరిన తర్వాత వారిని ఒక ప్రాంతానికి చేరుకోవాలని చెప్పి, ప్రత్యేక డ్రెస్ కోడ్ లేదంటే ఇతర ఆనవాళ్లను ప్రదర్శించాలని చెబుతారు. దిగుమతిదారులకు కూడా ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఫలానా డ్రెస్ లేదంటే ఇతర ఆనవాళ్లతో ఉన్నవారిని కలవాలని చెబుతారు. అక్కడకు వెళ్లిన తర్వాత కొకైన్ అయితే 'కే' అని, బ్రౌన్‌షుగర్ అయితే 'బి' అని ఇలా ఒక కోడ్ చెప్పి పరిచయం చేసుకుంటారు. కొరియర్‌కు డ్రగ్ సరఫరాచేసిన వ్యక్తి చెప్పిన కోడ్‌కు, సరుకు తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యక్తి పలికిన కోడ్ సరిపోతే ఆ సరుకుని అతనికి అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోతారు. దీనివల్ల కొరియర్ పోలీసులకు పట్టుబడినాసరే ఎవరు పంపించారు, ఎవరికి అందజేయాలనే వివరాలు బయటపడే అవకాశం ఉండదు. ఇలా దిగుమతి చేసుకున్న డ్రగ్స్‌ను నగరంలో తమకు పరిచయస్తులైనవారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఫుడ్ లేబొరేటరీ సేవలందేనా?

... 5వ పేజీ తరువాయి

జిల్లాల ఆహార, భద్రతా ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీల సందర్భంగా సేకరించిన నమూనాలను ఈ లేబ్‌కు పంపుతున్నారు. వాటిని అక్కడి సిబ్బంది అనాలసిస్ చేసి రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారు. అయితే విశాఖలో లేబ్ అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికీ అధికారులు హైదరాబాద్‌కు నమూనాలు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఫలితాలు రావడానికి కనీసం పది నుంచి నెల రోజుల సమయం పడుతోంది. దీంతో నిందితులపై సకాలంలో చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఈశాఖ పనితీరుపైనా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.

ఇన్‌స్టాల్ చేయని పరికరాలు

లేబ్‌లో ఆయిల్స్, ఆహారం, పప్పులు, పాలు, పాల ఆధారిత పదార్థాలు, చాక్లెట్స్, బిస్కెట్స్, సాఫ్ట్ డ్రింక్ వంటి 17 సెక్షన్స్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన 30 రకాల పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ వీటిని పూర్తిస్థాయిలో ఇన్‌స్టాల్ చేయలేదు. ఇక్కడ పనిచేసేందుకు వివిధ కేడర్లకు చెందిన సుమారు 80 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇప్పటివరకు ప్రారంభించలేదు. దీంతో స్టేట్ ఫుడ్ లేబ్ సేవల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

... 5వ పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పరపతిని కోల్పోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని జిల్లాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల కంటే వైసీపీ బలంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ మినహా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏదీ అమలు చేయలేదన్నారు. అయినప్పటికీ రూ.1.2 లక్షల కోట్లు అప్పుచేశారని ఎద్దేవా చేశారు.

యువత రక్తదానం

సిరిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : యువత రక్తదానం చేయడం ద్వారా రక్తం కొరత చాలా వరకు తీరుతుందని అడ్వకేట్ కాశీభట్ల బ్రహ్మస్వరూప్ అన్నారు. ఆదివారం విశాఖ జిల్లా బాడీ లిఫ్టింగ్ సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి కె.చిరంజీవి స్మారక స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని రామా టాకీస్ ఎదురుగా వాయుపుత్ర క్లబ్ ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వాయుపుత్ర క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోరుతూ శాంతియాత్ర

సిరిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) :ఓం శాంతి విశ్వశాంతి కోసం ప్రజాపిత బ్రహ్మకుమారీలు శాంతియాత్రను ఆదివారం నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని విశ్వశాంతిని నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నామని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. నేటి సమాజంలో ప్రతి ఒక్క వ్యక్తికి జీవితంలో సుఖం తప్పకుండా కావాలని. దాని కోసం అశుద్ధ ఆహార పానీయాల సేవించడం మానివేయాలని కోరారు. పరమేశ్వరుని ధ్యానం అందరికీ నిత్యావసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మణి, గాయత్రి, స్వర్ణలత, రష్మీ, సౌమ్య, కుమార్ అక్కయ్య, బీకే సత్యవతి, సూరిబాబు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్కిరెడ్డిపాలెం వద్ద చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అక్కిరెడ్డిపాలేనికి చెందిన కర్రి ప్రవీణ్ (27) జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ సమీపంలోని సర్వీస్ రోడ్డులో గల పండ్ల దుకాణంలో సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం పెళ్లయిన ప్రవీణ్‌కు భార్య, 3, 4 ఏళ్ల వయసు గల ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. దంపతులిద్దరూ గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవ పడినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా ఆదివారం ఉదయం డెయిరీ సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న కొంతమంది పండ్ల దుకాణాల వద్ద ప్రవీణ్ ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రవీణ్ భార్యతో పాటుఇతర కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని విలపించారు. ప్రవీణ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20,వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150

చేపలు, మటన్ వైపే మొగ్గు

- బర్డ్ ఫ్లూ భయంలో గణనీయంగా తగ్గిన చికెన్ అమ్మకాలు
- మటన్ ధర ఎక్కువగా ఉండడంతో మాంసాహారప్రియులకు ఇబ్బంది


మటన్, చేపల అమ్మకాల సెంటర్ల వద్ద కొనుగోలుదారుల రద్దీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ విక్రయాలు పడిపోయాయి. మాంసాహారప్రియులు ప్రస్తుతం కోడిమాంసంకు ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే మటన్ ఖరీదు కిలో రూ.1000 కావడంతో అంతకంటే తక్కువ ధరలకు చేపలు లభ్యం అవుతుండడంతో వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలపోతుండగా, చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతానికి నగరంలో బర్డ్ ఫ్లూ ప్రభావం కనిపించకున్నా ప్రజల్లో మాత్రం భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో చికెన్ తినటానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో చికెన్ ధరలు కూడా తగ్గాయి.

ఆదివారం వచ్చిందంటే చాలు అధిక శాతం చికెన్ కొనేవారు. దీంతో ఉదయం వేళల్లో చికెన్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల బారులు తీరేవారు. బర్డ్‌ఫ్లూ భయం వల్ల దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. మరోవైపు మటన్ దుకాణదారులు మొన్నటి వరకూ కిలో రూ.850 వరకు అమ్మిన వారు ఇప్పుడు రూ.వెయ్యికి పెంచేశారు. దీంతో చాలామంది మాంసాహారప్రియులు మటన్ కొనుగోలు చేసుకోలేకపోతున్నారు. మటన్‌కు డిమాండ్ పెరగడంతో దుకాణదారులు మటన్ ధరలను పెంచడంతో పాటు మేకల కబేళాల్లో కాకుండా తమకు అనువైన చోట మేకలు, గొర్రెలను వధిస్తూ విక్రయాలు చేపడుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. కబేళాలో బలి ఇచ్చే మటన్‌కు జీవీఎంసీ వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో వైద్యులతో నిర్ధారణ చేస్తారు. మేకలు, గొర్రెలు వధించిన తర్వాత దానిపై సీల్ వేస్తారు. కానీ ప్రస్తుతం మటన్ దుకాణాల వద్ద చంపుతున్న వాటిపై ఎలాంటి సీల్ కనిపించడం లేదు. డిమాండ్ ఉండడంతో దుకాణాల వద్దే చంపి వెంటనే అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు కూడా పెద్దగా పట్టించుకుంటున్న దాఖలేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మైమరిపించిన మాయాజాలం



యువతిని గాలిలో నిలిపిన ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి


జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య అవార్డు అందజేస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం బీఎస్ రెడ్డి మహేంద్రజాలం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. శూన్యం నుంచి సుందరీమణిని సృష్టించి ప్రేక్షకులను తన మంత్రజాలంతో ఆశ్చర్యచకితులను చేశారు. ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే సృష్టించిన యువతిని పక్షిలా మార్చి గాల్లోకి ఎగరవేయడంతో నోరెళ్లబెట్టారు. అంతటితో ఆగకుండా ఎగిరిన పక్షిని చెట్టుగా మార్చడంతో సంభ్రామాశ్చర్యాలకు గురై చప్పట్ల జడివాన కురిసేలా చేశారు.

'ఇండియన్ మ్యాజిక్ అకాడమీ (ఐఎంఏ) అవార్డ్ నైట్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు బీఎస్ రెడ్డి అధునాతన మహేంద్రజాల ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. పదిహేను నిమిషాల పాటు తన మాయజాలంతో జనాలను కట్టిపడేశారు. అకాడమీ సభ్యుడు సుదర్శన్ తన ఇంద్రజాల విద్యలతో ప్రజలను కనువిందు చేశారు. అనంతరం కువైట్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన మెజిషియన్లు గుగాంపూ, మమడాతో పాటు దేశంలోని ప్రముఖ ఇంద్రజాలకులు జూనియర్ పీసీ సర్కార్, సామ్రాజ్, భూపేష్ దావే, యోనా, చారి, కేఎస్ రమేష్, సామల వేణు, కురోలి గణేష్‌లకు గోల్డెన్ మెజిషన్ అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి , గురుమూర్తి రెడ్డి, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ రమణమూర్తి, మెజిషియన్లు పాల్గొన్నారు.

గాయత్రి దంత వైద్య ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రి ప్రారంభిస్తున్న ఆచార్య పి.సోమరాజు, పాల్గొన్న దక్షిణామూర్తి, రాజగణపతి తదితరులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే గాయత్రి విద్యా పరిషత్ లక్ష్యమని ఆ సంస్థ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం పెదవాల్తేరులోని గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి నగర కేంద్రంలో ఆయన దంత వైద్య ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నామమాత్రపు రుసుంతో వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి, సంయుక్త కార్యదర్శి ఆచార్య పి.రాజగణపతి, సౌభాగ్యమ్మ నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ఆచార్య విజయ రత్నం, లీలావతి, వైద్య కేంద్ర నిర్వాహకులు డాక్టర్ పద్మినీదేవి, గాయత్రి మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలిలో వ్యాయామం తప్పనిసరి : సీపీ



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి


వాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక జీవన శైలిలో ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయడం తప్పనిసరి అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం డివైన్ టచ్ స్కూల్ ఆధ్వర్యంలో రామకృష్ణ బీచ్ వద్ద వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా వ్యాయామం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే క్రీడల్లో కూడా రాణించేందుకు కృషి చేయాలన్నారు. చదువు వల్ల లభించే జ్ఞానం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూనే ఆరోగ్యపరంగా, వ్యక్తిగతంగా వికాసం సాధించాలన్నారు. సరికొత్త ఆలోచనలతో ఎప్పుడూ ముందు ఉండేందుకు పోటీ పడేందుకు ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయి సేవినీ మాతాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు


కప్పస్తంభం వద్ద న్యాయమూర్తులు వై.లక్ష్మణరావు, హరిహరనాథ శర్మ

సింహాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ప్రొటోకాల్ విభాగం ఏఈఓ వెంపలి రాంబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాలను పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేదస్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

సీతాన్వేషణలో భక్తిభావం, సచ్ఛీలత చూపిన హనుమంతుడు

- ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మ జాడ కనుగొనేందుకు లంకా నగరం వెళ్లిన హనుమంతుడు ఆ నగర వైభోగం చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడని, అయితే తాను వెళ్లిన కార్యం పట్ల మనసు సడలకుండా సీతాన్వేషణ పైనే దృష్టి సారించాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రచవనాల్లో భాగంగా ఆదివారం సుందరకాండలోని హనుమ లంకానగరం ప్రవేశం గురించి వివరించారు. కార్యసాధనకు దేశకాలముల అనుకూలత అత్యంత ప్రధానమన్నారు. నిరుత్సాహం, నిర్వేదం పొందిన వారు ఏ కార్యం సాధించలేరన్నారు. ఉత్సాహంతో పని చేసినప్పుడు మాత్రమే కార్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. లంకానగరం శోభను చూసిన హనుమ సామ, దాన, భేద దండోపాయాలతో లంకానగరం జయించడం చాలా కష్టమని గ్రహించాడు. ఇక్కడ కార్యసిద్ధి సాధించాలంటే ముందుగా సింహావలోకనం అత్యంత ఆవశ్యకమని అనుకున్నాడు. పిల్లిపిల్ల అంత ఆకారంలో లంకానగరం తిరుగుతూ సీతాన్వేషణ చేపట్టారని తెలిపారు. సీతాన్వేషణలో బాగంగా లంకానగరం గాలిస్తూ పుష్పకవిమానం చూసి, అనంతరం రావణాసురుని అంతఃపురంలోకి ప్రవేశించి రావణుడి తేజస్సు చూసి ముచ్చటపడ్డాడు. రావణుడు పడుకుని ఉన్నప్పుడే ఇంత తేజస్సు కలిగి ఉన్నాడే అని ఆశ్చర్యపోయాడు. శత్రువులోని మంచి లక్షణాన్ని ప్రశంసపూర్వకంగా చూడడం హనుమంతుడి సచ్ఛీలతగా పేర్కొన్నారు. లంకానగరం అంతా వెతికినా సీతమ్మ జాడ కనపడకపోవటంతో నిరాశపడినా హనుమ.. సీతారాములను మనస్ఫూర్తిగా ప్రార్థించి మళ్లీ తన తన ప్రయత్నాని కొనసాగించి అశోకవనంతో సీత ఉన్నట్టు కనుగొన్నాడు. లంకా నగరంలో సీతాన్వేషణ చేపట్టిన సమయంలో హనుమంతుడు భక్తిభావం, సచ్ఛీలత ప్రదర్శించారని చాగంటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

ఆరిలోవ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలిలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం 24 వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం శివపార్వతుల కల్యాణం కన్నుల పండవగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అంపోలు ఉమామహేశ్వర శర్మ వేద మంత్రాలు మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మణశాస్త్రి పర్యవేక్షణలో జరిగింది. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. సుమారు 5 వేల మందికి వివాహ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం 1001 బిందెలతో స్వామివారికి ప్రత్యేక పవిత్ర గంగతో అభిషేకాలు నిర్వహించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చోరీ కేసులో పోలీసులు ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకుల ఆరోపణ


ఆస్పత్రి బయట మృతుడి కుటుంబీకులు, (ఇన్‌సెట్‌లో) మృతుడు ఆనంద్ (ఫైల్)

గోపాలపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వివాదానికి దారితీసింది.స్థానిక ఇందిరా నగర్‌కు చెందిన సోమేశ్ అనే ఆటోడ్రైవర్ తన ఆటోను ఏడాది క్రితం అదే ప్రాంతానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అయితే సోమేశ్ ఆటోలో ఉంచిన వ్యాలెట్ కనిపించకపోవడంతో దానిని తిరిగి ఇవ్వాలని నాగరాజును నిలదీశాడు. అయితే తనకు ఆటోలో ఎటువంటి వ్యాలెట్ దొరకలేదని నాగరాజు చెప్పడంతో వివాదం ముగిసింది. ఇదిలావుండగా నాగరాజుకు వరసకు సోదరుడైన రౌతు ఆనంద్ (30) రెండు రోజుల క్రితం ఇల్లు మారుతున్న సమయంలో ఒక వ్యాలెట్ దొరికింది. అందులో సోమేశ్‌కు చెందిన కొన్ని కార్డులు లభించాయి. దీంతో దానిని సోమేశ్‌కు ఇచ్చాడు. అయితే వ్యాలెట్ తీసుకున్న సోమేశ్ అందులోఉన్న నగదు ఇవ్వాలంటూ ఆనంద్‌ను అడిగాడు. వ్యాలెట్‌లో ఎటువంటి నగదు లేదని ఆనంద్ చెప్పాడు. దీంతో సోమేశ్ తన వ్యాలెట్ పోయిందని, ఆనంద్, నాగరాజులపై అనుమానం ఉందంటూ రెండు రోజుల క్రితం గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వారిద్దరిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆనంద్ ఉరి వేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన ఆనంద్ తల్లి కనకమహాలక్ష్మి ఉరి వేసుకుని ఉన్న కుమారుడిని చూసి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించి స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆనంద్‌మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆనంద్‌పై చోరీ ఆరోపణలు చేయడంతో పాటు సోమేశ్ పోగొట్టుకున్న నగదును ఆనంద్, నాగరాజులు ఇవ్వాలని పోలీసులు చెప్పినందునే మనస్తాపంతో ఆనంద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న గోపాలపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావును వివరణ కోరగా.. ఆనంద్, నాగరాజులపై ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. ఆనంద్ ఆత్మ హత్య చేసుకున్న విషయంపై కుటుంబీకులు చేస్తున్న ఆరోపణలపై కూడా విచారణ జరిపిస్తామని ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బి.మురళీధర్ ఆదేశించారు. మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణపై ఆదివారం బీవీకే కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డెక్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఐవో మాట్లాడుతూ ఉదయం 8 గంటలకే సీఎస్‌లు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలస్యమైన విద్యార్థులకు సరైన కారణముంటే పరీక్షకు అనుమతి కల్పించాలన్నారు. ఇన్విజిలేటర్ల ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని పరీక్షా గదుల్లోకి పంపించాలన్నారు. కచ్చితంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులంతా పరీక్షలు రాసే విధంగా చూడాలన్నారు.

తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చా

- రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ చిత్ర హీరో ప్రదీప్ రంగనాథన్


చిత్ర నటీనటులు ప్రదీప్ రంగనాథన్, కయాదు లోహర్‌లకు స్వాగతం పలుకుతున్న డిస్ట్రిబ్యూటర్లు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తనపై ఇంతటి ప్రేమను చూపిస్తున్న తెలుగు ప్రజలందరికీ థ్యాంక్స్ కంటే ఇంకేమీ చెప్పలేనని హీరో ప్రదీప్ రంగనాథన్ పేర్కొన్నారు. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' చిత్రాన్ని విజయవంతం చేసిన తెలుగు ప్రేక్షకులు ఎంతో గొప్పవారని పేర్కొన్నారు. ఆయన తాజాగా నటించిన 'రిటర్న్ ఆఫ్ ధి డ్రాగన్' చిత్ర విజయోత్సవంలో భాగంగా ఆదివారం జగదాంబ థియేటర్‌లో సందడి చేశారు. ముందుగా చిత్ర యూనిట్‌కు పూర్వీ పిక్చర్స్ అధినేత వేగి వీరునాయుడు, వేగి శ్రీనివాస్, జగదాంబ థియేటర్ అధినేత వేగి జగదీష్ కుమార్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. ఓ సాధారణ కుర్రాడు జీవితంలో ముందుకు వెళ్లాలని చేసే ప్రయత్నమే తమ చిత్ర కథాంశమన్నారు. జీవితంలో ఏదో ఒకటి సాధించాలని గట్టిగా ప్రయత్నించే ప్రతి ఒక్కరి మనస్సుల్లో తమ చిత్రం నిలిచిపోతుందన్నారు. చిత్రం విడుదలైనప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులు మంచి ఆదరణ చూపిస్తున్నారన్నారు. సినిమాను సూపర్‌సక్సెస్ చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పేందుకే ఇక్కడికొచ్చానన్నారు. చిత్రం బాగుంటే ఏ హీరోనైనా ఆదరించే గొప్ప మనస్సు ఇక్కడ ప్రజలకు ఉందన్నారు. హీరోయిన్ కయాదు లోహర్ మాట్లాడుతూ చిత్రానికి గొప్ప విజయాన్ని చేకూర్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంచి సినిమా ద్వారా తెలుగులోని సైతం మంచి పేరు సంపాదించుకోవడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారని మరోసారి రుజువు చేశారన్నారు. ఆదివారం కూడా విశాఖలో హౌస్‌ఫుల్ కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కుటుంబమంతా కలిసి చూసే చిత్రమన్నారు. మధ్యాహ్నం ప్రేక్షకులతో కలిసి వారు సినిమాను వీక్షించారు. హీరో ప్రదీప్‌తో సెల్ఫీలు దిగేందుకు కొందరు ప్రేక్షకులు ఉత్సాహం చూపారు.

ఎర్రన్నాయుడుకి నివాళి


ఎర్రన్నాయుడికి నివాళి అర్పిస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పాలమరశెట్టి శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పనాయుడు, టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావును నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు జయంతిని పురస్కరించుకుని జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఎర్రన్నాయుడుతో ఉన్న అనుబంధాన్ని అప్పలనాయుడు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాజిద్దున్, హరి, బల్లి మధు, శివ, బొబ్బిలి శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిడిజాలలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ శ్రీభరత్

ఆనందపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం గిడిజాలలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు గంటా రవితేజ, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు పాండ్రంకి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సినగం అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, ఇంకా బోసుబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిజిటల్ భద్రత ఎంతో ముఖ్యం

- 'గీతం' వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ భద్రత ఎంతో ముఖ్యమైనదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా అన్నారు. ఆదివారం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తన అనే అంశంపై ప్రమోషన్ ఆఫ్ అకడమిక్, రీసెర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ సురక్షితంగా ఇంటర్నెట్‌ను వాడడంలో అవగాహన, నైపుణ్యాలను అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సాంకేతికతను సమర్ధవంతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించేందుకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ స్పార్క్‌ప్రాజెక్టు జాతీయ సంయుక్త కో-ఆర్డినేటర్, అంతర్జాతీయ సంబంధాల డీన్, కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రబీబ్రత ముఖర్జీ మాట్లాడుతూ సైబర్ భద్రతా విద్య, సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం ద్వారా వ్యక్తులు, సంస్థలను డిజిటల్ ముప్పుల నుంచి రక్షించవచ్చన్నారు. స్పార్క్ ప్రాజెక్ట్ రష్యన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ అద్వర్డ్‌పట్రకోవ్ వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ విభూతిసచ్‌దేవ్, డాక్టర్ లియూడ్మిలాబటురినా, డిజిటల్ పర్యావరణం, యువతకు ముప్పు అనే అంశంపై మాట్లాడారు.

నామినేటెడ్ పదవుల్లో గీత కార్మిక కులాలను విస్మరించారు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన వివిధ విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, నామినేటెడ్ పదవుల్లోనూ గీత కార్మిక కులాలను విస్మరించారని ఆ వర్గం కులాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆదర్శనగర్‌లో నిర్వహించిన నాయకుల సమావేశంలో విశాఖ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు, నాయకులు రేఖల కృష్ణ గౌడ్, ఆచార్య వివేకానంద మూర్తి, గుత్తుల వెంకటేశ్వరరావు, సంతోష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న గీత కార్మిక వర్గాలను విస్మరించడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లో అధిక విద్యావంతులున్న తమ వారికి ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల్లోనే కాకుండా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి కృషి చేస్తున్న విషయం పాలకులు గమనించాలని కోరారు.

అనంతపురం నుంచి టమాటాల దిగుమతి



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాలు పరిశీలిస్తున్న అధికారులు

సీతమ్మధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతు బజార్‌కు అనంతపురం నుంచి ప్రభుత్వం టమాటాను సరఫరా చేయడంతో అమ్మకాలపై మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్‌లు ఆదివారం పరిశీలించారు. సీతమ్మధార రైతుబజార్‌కు ప్రభుత్వం అనంతపురం నుంచి ఆదివారం రెండు టన్నుల టమాటాను రైతులకు సరఫరా చేశారు.

రెండుచోట్ల వైద్య శిబిరాలు



వాకర్స్ క్లబ్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం కేర్, హెచ్‌సీజీ ఆసుపత్రులు సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశాయి. ఉదయం 6.30 గంటల నుంచి వాకర్స్ క్లబ్ కళా వేదికలో వైద్య సిబ్బంది ఆర్థోపెడిక్, ఆర్‌బీఎస్, శరీర బరువుకు తగ్గట్టుగా ఆరోగ్య ప్రమాణాల చికిత్సలు చేపట్టారు. వైద్యులు విజయ్ ఆదిత్య, రఘు, రేవంత్, సహాయక సిబ్బంది చికిత్సలు అందించారు. ఆరోగ్య పరిరక్షణకు వచ్చిన వారికి తగిన సూచనలు ఇచ్చారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సి.హెచ్.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, కమిటీ సభ్యులు వైద్య శిబిరం నిర్వహణ ఏర్పాట్లు చేశారు. మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీ, కైలాసపురం, మర్రిపాలెం ప్రాంతాల నుంచి 164 మంది చికిత్సలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వే న్యూకాలనీలో...

అల్లిపురం: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ టీకే శశికళ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 130 మందికి ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె.యశ్వంత్ వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



కళింగనగర్‌లో రూపుదిద్దుకున్న రోడ్డు డివైడర్

మాధవధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నుంచి మాధవధార ఉడాకాలనీ వరకు నవీకరించిన 48ఎ బస్‌రూట్‌లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. నిరుడు ఫిబ్రవరిలో ఎన్నికల హడావుడి నేపథ్యంలో రోడ్లు, కొత్త నిర్మాణాలకు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. ఈ క్రమంలో సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మాధవధార ఉడాకాలనీ దాటి ఆర్‌అండ్‌బీ జంక్షన్ వరకు రూ.9 కోట్లు వెచ్చించి తారు రోడ్లు నిర్మించారు. కొత్తగా మెరుస్తున్న రోడ్లపై వాహనదారులు శృతిమించిన వేగంతో దూసుకెళ్తూ ప్రయాణికులు, నివాసితులు, బాటసారులకు దడ పుట్టిస్తున్నారు. మురళీనగర్, మాధవధారలో ప్రమాదాలు జరుగుతున్న చోట ఆదివారం డివైడర్లు నిర్మించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం గుర్తించిన చోట కాంట్రాక్టు సిబ్బంది వేగ నియంత్రణకు బ్రేకర్లు వేస్తున్నారు. ఈ దారిలో 48ఎ, 48ఎస్ బస్సుల కోసం వేచి ఉండే వారికి, పాదచారులకు, ప్రయాణికులకు భద్రత లభిస్తుంది.

రఘువర్మకు మద్దతుగా టీడీపీ ప్రచారం

సీతమ్మధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఎంపీ శ్రీభరత్ సూచనతో ఉత్తర నియోజకవర్గం 24వ వార్డులో టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, వార్డు అధ్యక్షుడు బర్ల బాలకృష్ణ, వి.భరత్ తదితరులు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. 14వ వార్డులో టీడీపీ నాయకులు గొంప ధర్మారావు, వసంతరావులు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ వెంకటరావు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పలు కేసులలో నిందితులుగా ఉండటంతో రౌడీషీట్ తెరిచామని, ఇకనైనా మంచి బుద్ధితో మెలగాలని నాలుగో పట్టణ ఎస్ఐ వెంకటరావు హితవు పలికారు. అసాంఘిక కార్యకలాపాలకు, తగవులకు, శాంతిభద్రతలకు విరుద్ధంగా నడుచుకుంటే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ దాలిబాబు పర్యవేక్షణలో ఆదివారం స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల్లో క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించడం కీలకం



క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను సకాలంలో గుర్తించడం ద్వారా పూర్తిగా కోలుకునేలా చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల క్యాన్సర్ దినం నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో ఇన్‌స్పైరింగ్ యాక్షన్-2025 పేరుతో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ బారినపడి కోలుకున్న చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వి.మురళీ కృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ల నుంచి కోలుకున్న చిన్నారులకు భవిష్యత్‌లో అవసరమైన సహకారం అందించడం కీలకమన్నారు. డాక్టర్ వై.రాజనీప్రియ మాట్లాడుతూ పిల్లలు, వారి కుటుంబ సభ్యులకు మానసిక, భావోద్వేగ సహాయం నిరంతరం అందించాలన్నారు. డాక్టర్ బాలా స్టాలిన్ చౌదరి మాట్లాడుతూ పీడియాట్రిక్ అంకాలజీలో సాధించిన పురోగతి, సమానమైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డాక్టర్ ప్రవీణ వున్నా మాట్లాడుతూ కుటుంబ సభ్యుల తోడ్పాటుతోనే చిన్నారులు క్యాన్సర్‌పై విజయం సాధించగలరన్నారు. ఈ సందర్భంగా వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

ముదిమి వయసులో.. తరగతి గదిలో..

60 ఏళ్ల తరువాత కలుసుకున్న అలనాటి విద్యార్థులు ▸▸ సెయింట్ ఆంథోనీ పాఠశాల వేదిక



సెయింట్ ఆంథోని పాఠశాల కళా వేదికపై పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు



నాడు తాము చదువుకున్న తరగతి గదిలో..

మహారాణిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల కిందట కలిసి చదువుకున్న స్నేహితులు.. ఇప్పుడు ఆ పాఠశాలలోనే కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. విశాఖపట్నంలో సుప్రసిద్ధ సెయింట్ ఆంథోని పాఠశాలలో ఆదివారం ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. మహారాణిపేటలో ఉన్న సెయింట్ ఆంథోని పాఠశాలలో 1965లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 60 ఏళ్లు నిండిన సందర్భంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు కూడా అందరికీ లేవు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఒక్కరొక్కరుగా చిరునామాలు, సెల్‌ఫోన్ నంబర్లు సేకరించి, వాట్సాప్ గ్రూపును ఏర్పాటుచేసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన సుమారు 40 మంది విశాఖ వచ్చి, ఆదివారం సెయింట్ ఆంథోని పాఠశాలలో కలుసుకున్నారు. అందరి వయసు ఇంచుమించు 75 సంవత్సరాలు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. సంతోషంతో ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. నాడు చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగారు. కొద్దిసేపు చిన్నపిల్లలుగా మారిపోయారు. అప్పటి సంగతులు, విశేషాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత స్థితిగతులు, పిల్లలు, వారి కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. వృద్ధాప్యంతో మరణించిన తోటి స్నేహితులను తలచుకున్నారు. నాడు వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఇప్పుడు జీవించి లేకపోయినా, ఈ పాఠశాలలో పనిచేసి రిటైరైన ఓ ఉపాధ్యాయుడిని ఆహ్వానించి సన్మానించారు. అందరూ కలిసి మధ్యాహ్న భోజనం ఆరగించారు. గ్రూపు ఫొటో దిగారు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం'



సమావేశంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అల్లిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా, ఇదే వైఖరి అవలంబిస్తే ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో పి.శేఖర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు ఆమోదించినట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ అరికట్టాలని, పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. విద్యార్థులను చైతన్యపరిచేందుకు విశాఖ వేదికగా మే నెలలో విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, కోశాధికారి భవాని, కంజీర పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



రైల్వే న్యూకాలనీ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షలు ఆదివారం తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల్లో రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నిరసన తెలుపుతారనే అనుమానంతో పోలీసులు పరీక్షా కేంద్రం ఎదుట గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి 144వ సెక్షన్ విధించారు. కానీ అలాంటివి లేకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షా కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో 480 మంది రాయాల్సి ఉండగా 357 మంది హాజరయ్యారు. పరీక్ష రాసేందుకు ఉత్సాహంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. శ్రీకాకుళం, విశాఖ నగరానికి చెందిన వీరు ఆలస్యంగా రావడంతో లోపలకు అనుమతించలేదు.

'ప్రజలను హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లమోతు రాధాకృష్ణ తదితరులు

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘం మహాసభలను ఆదివారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సంఘం కార్యవర్గ సభ్యుడు ఆర్.జగపతిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా 'విశ్వతత్వం-విశ్వపరిణామం' అనే అంశంపై భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ ప్రసంగించారు. విశ్వం.. ఆది అంతాలు లేనిదని, నియమబద్ధంగా పరిణమిస్తుందన్నారు. కుల మతాలు, జాతులు, వర్గాల జాడ్యం నుంచి మానవాళిని బయటకు తెచ్చి హేతుబద్ధంగా ఆలోచింప చేయాలన్నారు. పరస్పర సహకారంతో మానవాభివృద్ధి సాధ్యమన్నారు. వైజ్ఞానిక వికాసం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన హేతువాద మానవవాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి పుస్తకాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ట్రెజరర్ నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి సమీక్షించారు. సంఘం నూతన అధ్యక్షులుగా ఆర్.జగపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పాండురంగారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటి రాజశేఖర్, రాంప్రభు, ఎ.సత్యనారాయణ, సురేష్, షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.

'శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి చేస్తా'



కట్టా మల్లేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని, శెట్టిబలిజ, కట్టాస్, గౌడ, శ్రీశైన, యాత కులాలు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని బీసీ సమన్వయ కమిటీ, శెట్టిబలిజ, కట్టాస్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో శెట్టి బలిజ కట్టాస్ వివాహ పరిచయ వేదిక, పలువురికి ఆర్థిక చేయూత అందించే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ ఒకచోట కలుసుకోవడం సంఘం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా జైశెట్టిబలిజ ప్రతినిధి విజయ్‌కుమార్‌కి కట్టా మల్లేశ్వరరావు రూ.25 వేల చెక్కును అందచేశారు. అనంతరం నిర్వాహకులు కట్టా మల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు కట్టా శ్రీనివాస్, గ్రాండ త్రినాథ్, పాలిక శ్రీనివాస్, స్టాలిన్, ఇళ్ల వెంకటేశ్వరరావు, వెండ్రా త్రినాథ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి గేటు ఏర్పాటు



కార్యాలయం ప్రవేశ మార్గం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప గేటు

మురళీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ మాధవధార హైవే రోడ్డులోని కార్యాలయం వద్ద కొత్త ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసుకున్నారు. పలుమార్లు డిపార్ట్‌మెంట్‌కి విన్నపాలు చేసినా, పని జరగకపోవడంతో ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సొంత నిధులతోనే అకౌంట్స్ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద కొత్త ఐరన్ గేట్ ఏర్పాటు చేశారు. దాదాపు రూ.40 వేలు ఖర్చు చేసి ఈ కొత్త గేటు అమర్చారు. చీకటి పడగానే ఆకతాయిల బెడద ఉండేది. వాచ్‌మన్ కుటుంబంతో వాగ్వాదాలకు దిగుతున్న మందుబాబుల బెడదను అరికట్టేలా రక్షణ కోసం ప్రవేశంలో కొత్త గేటు అమర్చారు. హైవే రోడ్డులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను ఆనుకొని ఉన్న ఈ కార్యాలయం దాదాపు ఎకరం స్థలంలో విస్తరించి ఉంది. 1994లో కట్టిన ఈ బిల్డింగ్ ఆరంభమైన తొలినాళ్లలో ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ విభాగం కోసం కేటాయించారు. తరువాత పలు విభాగాలకు కేటాయిస్తూ వచ్చారు. ఇపుడు ఈ భవంతిలో రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు విశాఖపట్నం డివిజన్ సూపరింటెండెంట్, అకౌంట్స్ స్టాఫ్ అంతా కలిపి 20 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు.

శివరాత్రి జాగరణ స్నానాలకు ఏర్పాట్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా ఆ రోజు జాగరణ స్నానాలు చేసే భక్తుల కోసం సాగర్‌నగర్ తదితర బీచ్‌లలో జీవీఎంసీ విద్యుత్ దీపాలను ఆదివారం ఏర్పాటు చేసింది. శివరాత్రి రోజు భక్తులు జాగరణ చేసి తెల్లవారు జామున సముద్ర స్నానాలకు వేలాదిగా తీరాలకు చేరుకోవడం ఆనవాయితీ. చీకటిలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బీచ్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఆ రోజు స్వచ్ఛంద సంస్థలు వారికి తోచిన సహాయం భక్తులకు చేస్తుంటారు. నగరంలోని ఆర్‌కే బీచ్ మొదలుకొని భీమిలి తీరం వరకు ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు చేస్తుంటారు. ప్రమాదకర ప్రాంతాల్లోనూ, ఎక్కువమంది భక్తులు చేరుకునే బీచ్‌ల వద్ద అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నీటి వృథా..కానరాదా?



ట్యాంకరు నిండి రోడ్డుపై వృథాగాపోతున్న నీరు

మాధవధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విమానాశ్రయం నుంచి తాటిచెట్లపాలెం వరకు ఉన్న హైవే సెంటర్ డివైడర్‌లో మొక్కల సంరక్షణకు కేటాయించిన నీటి నిల్వ కేంద్రం వద్ద తరచూ జలం వృథా అవుతోంది. ఇక్కడ నుంచే జీవీఎంసీ సిబ్బంది నిత్యం ట్యాంకర్లతో నీటిని పట్టుకుని పైపులతో మొక్కలకు అందిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడ నీటిని పట్టే కేంద్రం దగ్గర వాహన డ్రైవర్లు ట్యాంకర్లలో నింపే సమయంలో అవి నిండి రోడ్డంతా నీరు పారడం నిత్యకృత్యంగా మారుతోంది. ఈ ఏడాది ఎండాకాలం తీవ్రంగా ఉంటుందన్న సమాచారంతో నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తుతున్న జనం, ఈ వృథాను చూసి అవాక్కవుతున్నారు. ఈ ఫిల్లింగ్ పాయింట్ నిర్వహణకు ప్రత్యేకించి సిబ్బంది ఎవరూ ఉండరు. వాహనాలను తీసుకొచ్చిన డ్రైవర్లు ట్యాంకర్లు నింపడం, అవి నిండే దాకా పక్కనే ఉన్న హైవే గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో సేద తీరడం రివాజుగా మారింది. వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ట్యాంకర్ నిండి నీరు వృథా అవుతోంది. ఎవరైనా అప్రమత్తం చేశాక నీటి వృథాను అరికట్టి నింపాదిగా మొక్కలకు నీరు పెడుతుంటారు. మాధవధార పంప్‌హౌస్, జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాషువా నగర్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు



జాషువా నగర్ ప్రధాన రహదారిపై ఓవైపు దుకాణాలు, మరోవైపు నిలిపిన వాహనాలు

కంచరపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వవార్డు పరిధి జాషువానగర్ ప్రధాన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ఇరువైపులా తోపుడు బళ్లు, వర్తకుల దుకాణాలతో నిండిపోతుంది. అసలే ఇరుకు మార్గం కావడంతో పాటు కొండవాలు గ్రామాల నుంచి వచ్చే వాహనాలన్నీ ఇలాగే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సమీపంలో సచివాలయ సిబ్బంది ఉన్నా పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కంచరపాలెం మెట్టు బస్టాప్ నుంచి అశోక్‌నగర్ జాతీయ రహదారి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో 108 వంటి వాహనాలు కూడా ఈ మార్గంలో రాలేని దుస్థితి ఉంటుందంటే ఇక్కడ రోడ్డు ఏమేరకు ఆక్రమణలతో నిండిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్

... 5వ పేజీ తరువాయి

బ్రౌన్‌షుగర్‌ను సాగర్‌నగర్ వద్ద వేరొకరికి అందజేసే ప్రయత్నంలో టాస్క్‌ఫోర్స్, ఆరిలోవ పోలీసులు దాడిచేసి అతడ్ని అదుపులోకి తీసుకుని, బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా డ్రగ్స్‌తో పోలీసులకు పట్టుబడినవారు కొద్దిమందే ఉన్నప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న వారి సంఖ్య నగరంలో భారీగా ఉంటుందని పోలీసులే చెబుతుండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ప్రత్యేక కోడింగ్‌తో సరఫరా, విక్రయం

సింథటిక్ డ్రగ్స్‌ను ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొచ్చేవారు వాటిని ప్రత్యేక కోడింగ్ ద్వారా ఇతరులకు అందజేస్తున్నారు. సింథటిక్ డ్రగ్స్‌ను నగరానికి దిగుమతిచేసుకునేవారికి, ఇతర రాష్ట్రాల్లో వాటిని సరఫరాచేసేవారికి ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం తమకు కావాల్సిన సరుకు వివరాలను సరఫరాదారుడికి చెబితే, సుపారీకి పనిచేసే కొరియర్‌ల ద్వారా నగరానికి పంపిస్తున్నారు. కొరియర్‌లకు కూడా నగరంలోకి వచ్చినంతవరకు ఎవరికి వాటిని చేరవేయాలనేది తెలియదు. నగరానికి చేరిన తర్వాత వారిని ఒక ప్రాంతానికి చేరుకోవాలని చెప్పి, ప్రత్యేక డ్రెస్ కోడ్ లేదంటే ఇతర ఆనవాళ్లను ప్రదర్శించాలని చెబుతారు. దిగుమతిదారులకు కూడా ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఫలానా డ్రెస్ లేదంటే ఇతర ఆనవాళ్లతో ఉన్నవారిని కలవాలని చెబుతారు. అక్కడకు వెళ్లిన తర్వాత కొకైన్ అయితే 'కే' అని, బ్రౌన్‌షుగర్ అయితే 'బి' అని ఇలా ఒక కోడ్ చెప్పి పరిచయం చేసుకుంటారు. కొరియర్‌కు డ్రగ్ సరఫరాచేసిన వ్యక్తి చెప్పిన కోడ్‌కు, సరుకు తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యక్తి పలికిన కోడ్ సరిపోతే ఆ సరుకుని అతనికి అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోతారు. దీనివల్ల కొరియర్ పోలీసులకు పట్టుబడినాసరే ఎవరు పంపించారు, ఎవరికి అందజేయాలనే వివరాలు బయటపడే అవకాశం ఉండదు. ఇలా దిగుమతి చేసుకున్న డ్రగ్స్‌ను నగరంలో తమకు పరిచయస్తులైనవారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక రవాణాలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాసెస్ జరగదు. కానీ తప్పుడు మార్గంలో వెళ్లి నకిలీ వే బిల్లులు తయారుచేసి విశాఖకు ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు తనిఖీల సమయంలో నకిలీ వేబిల్లులు గుర్తుపట్టలేకపోవడంతో డ్రైవర్లు వందల లారీల నకిలీ వేబిల్లులతో ఇసుక తోలేశారు. కేవలం గనులు శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తే మాత్రమే నకిలీ వే బిల్లులు గుర్తించి పట్టుకుంటున్నారు. ఇలా రెండు నెలల్లో పదుల సంఖ్యలో నకిలీ వేబిల్లులతో లారీలు పట్టుకుని జరిమానా విధించారు.

దాడులపై ముందస్తు సమాచారం

గనులశాఖ అధికారులు దాడులు చేస్తారన్న విషయం ముందుగానే తెలుసుకుంటున్న లారీ డ్రైవర్లు అప్రమత్తమై రీచ్‌ల వద్దే ఉండిపోతున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు దారి పొడవునా ప్రతిరోజూ గనులశాఖ, విజిలెన్స్ అధికారులు లారీలు తనిఖీ చేయడం సాధ్యం కాదు. అందువల్ల దాడులు చేయని రోజుల్లో ఎక్కువగా నకిలీ బిల్లులతో ఇసుక నగరానికి తరలిస్తున్నారు.

నదులకు ఆనుకుని కొన్ని గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వి పొలాలు, కళ్లాల్లో నిల్వచేస్తున్న ఇసుకను కొందరు కొనుగోలుచేసి నకిలీ వేబిల్లులతో విశాఖకు తీసుకువస్తున్నారు. నగరంలో రిటైల్ వ్యాపారులు, బిల్డర్లకు ఇసుక సరఫరాచేసే కొందరు తమకు తెలిసిన లారీ డ్రైవర్ల ద్వారా నకిలీ వేబిల్లుల బాగోతం నడుపుతున్నారు. ఇసుక తరలింపునకు నామమాత్రపు రుసుం మాత్రమే వసూలు చేసే వీలుంది. అది కూడా రీచ్‌ల నిర్వహణకు మాత్రమే తీసుకుంటున్నారు. అయినా కొందరు సిబ్బంది రీచ్ నిర్వాహకులకు టోపీ పెట్టి లారీ డ్రైవర్లతో మిలాఖత్ అయి ఇసుక తరలిస్తున్నారు. ఇటువంటి అక్రమాలకు తెరదించాలంటే అన్ని శాఖలతో బృందాలను ఏర్పాటుచేసి నిరంతరం నిఘా ఉంచాలని గనులశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

... 5వ పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పరపతిని కోల్పోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని జిల్లాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల కంటే వైసీపీ బలంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ మినహా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏదీ అమలుచేయలేదన్నారు. అయినప్పటికీ రూ.1.2 లక్షల కోట్లు అప్పుచేశారని ఎద్దేవా చేశారు.

ఫుడ్ లేబొరేటరీ సేవలందేనా?

... 5వ పేజీ తరువాయి

జిల్లాల ఆహార, భద్రతా ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీల సందర్భంగా సేకరించిన నమూనాలను ఈ లేబ్‌కు పంపుతున్నారు. వాటిని అక్కడి సిబ్బంది అనాలసిస్ చేసి రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారు. అయితే విశాఖలో లేబ్ అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికీ అధికారులు హైదరాబాద్‌కు నమూనాలు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఫలితాలు రావడానికి కనీసం పది నుంచి నెల రోజుల సమయం పడుతోంది. దీంతో నిందితులపై సకాలంలో చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఈశాఖ పనితీరుపైనా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.

ఇన్‌స్టాల్ చేయని పరికరాలు

లేబ్‌లో ఆయిల్స్, ఆహారం, పప్పులు, పాలు, పాల ఆధారిత పదార్థాలు, చాక్లెట్స్, బిస్కెట్స్, సాఫ్ట్ డ్రింక్ వంటి 17 సెక్షన్స్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన 30 రకాల పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ వీటిని పూర్తిస్థాయిలో ఇన్‌స్టాల్ చేయలేదు. ఇక్కడ పనిచేసేందుకు వివిధ కేడర్లకు చెందిన సుమారు 80 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇప్పటివరకు ప్రారంభించలేదు. దీంతో స్టేట్ ఫుడ్ లేబ్ సేవల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

యువత రక్తదానం

సిరిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : యువత రక్తదానం చేయడం ద్వారా రక్తం కొరత చాలా వరకు తీరుతుందని అడ్వకేట్ కాశీభట్ల బ్రహ్మస్వరూప్ అన్నారు. ఆదివారం విశాఖ జిల్లా బాడీ లిఫ్టింగ్ సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి కె.చిరంజీవి స్మారక స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని రామా టాకీస్ ఎదురుగా వాయుపుత్ర క్లబ్ ఆవరణలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. వాయుపుత్ర క్లబ్ డైరెక్టర్ కిలాని గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోరుతూ శాంతియాత్ర

సిరిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) :ఓం శాంతి విశ్వశాంతి కోసం ప్రజాపిత బ్రహ్మకుమారీలు శాంతియాత్రను ఆదివారం నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని విశ్వశాంతిని నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నామని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. నేటి సమాజంలో ప్రతి ఒక్క వ్యక్తికి జీవితంలో సుఖం తప్పకుండా కావాలని. దాని కోసం అశుద్ధ ఆహార పానీయాల సేవించడం మానివేయాలని కోరారు. పరమేశ్వరుని ధ్యానం అందరికీ నిత్యావసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మణి, గాయత్రి, స్వర్ణలత, రష్మీ, సౌమ్య, కుమార్ అక్కయ్య, బీకే సత్యవతి, సూరిబాబు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్కిరెడ్డిపాలెం వద్ద చోటుచేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

అక్కిరెడ్డిపాలేనికి చెందిన కర్రి ప్రవీణ్ (27) జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ సమీపంలోని సర్వీస్ రోడ్డులో గల పండ్ల దుకాణంలో సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం పెళ్లయిన ప్రవీణ్‌కు భార్య, 3, 4 ఏళ్ల వయసు గల ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. దంపతులిద్దరూ గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవ పడినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా ఆదివారం ఉదయం డెయిరీ సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న కొంతమంది పండ్ల దుకాణాల వద్ద ప్రవీణ్ ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రవీణ్ భార్యతో పాటుఇతర కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని విలపించారు. ప్రవీణ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20,వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 36, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండచిసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150

చేపలు, మటన్ వైపే మొగ్గు

» బర్డ్ ఫ్లూ భయంలో గణనీయంగా తగ్గిన చికెన్ అమ్మకాలు
» మటన్ ధర ఎక్కువగా ఉండడంతో మాంసాహారప్రియులకు ఇబ్బంది



మటన్, చేపల అమ్మకాల సెంటర్ల వద్ద కొనుగోలుదారుల రద్దీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ విక్రయాలు పడిపోయాయి. మాంసాహారప్రియులు ప్రస్తుతం కోడిమాంసంకు ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్ వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే మటన్ ఖరీదు కిలో రూ.1000 కావడంతో అంతకంటే తక్కువ ధరలకు చేపలు లభ్యం అవుతుండడంతో వాటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలపోతుండగా, చేపల మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతానికి నగరంలో బర్డ్ ఫ్లూ ప్రభావం కనిపించకున్నా ప్రజల్లో మాత్రం భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో చికెన్ తినటానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో చికెన్ ధరలు కూడా తగ్గాయి.

ఆదివారం వచ్చిందంటే చాలు అధిక శాతం చికెన్ కొనేవారు. దీంతో ఉదయం వేళల్లో చికెన్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల బారులు తీరేవారు. బర్డ్‌ఫ్లూ భయం వల్ల దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. మరోవైపు మటన్ దుకాణదారులు మొన్నటి వరకూ కిలో రూ.850 వరకు అమ్మిన వారు ఇప్పుడు రూ.వెయ్యికి పెంచేశారు. దీంతో చాలామంది మాంసాహారప్రియులు మటన్ కొనుగోలు చేసుకోలేకపోతున్నారు. మటన్‌కు డిమాండ్ పెరగడంతో దుకాణదారులు మటన్ ధరలను పెంచడంతో పాటు మేకల కబేళాల్లో కాకుండా తమకు అనువైన చోట మేకలు, గొర్రెలను వధిస్తూ విక్రయాలు చేపడుతున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. కబేళాలో బలి ఇచ్చే మటన్‌కు జీవీఎంసీ వైద్య, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో వైద్యులతో నిర్ధారణ చేస్తారు. మేకలు, గొర్రెలు వధించిన తర్వాత దానిపై సీల్ వేస్తారు. కానీ ప్రస్తుతం మటన్ దుకాణాల వద్ద చంపుతున్న వాటిపై ఎలాంటి సీల్ కనిపించడం లేదు. డిమాండ్ ఉండడంతో దుకాణాల వద్దే చంపి వెంటనే అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు కూడా పెద్దగా పట్టించుకుంటున్న దాఖలేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మైమరిపించిన మాయాజాలం


యువతిని గాలిలో నిలిపిన ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి



జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య అవార్డు అందజేస్తున్న దృశ్యం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం బీఎస్ రెడ్డి మహేంద్రజాలం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. శూన్యం నుంచి సుందరీమణిని సృష్టించి ప్రేక్షకులను తన మంత్రజాలంతో ఆశ్చర్యచకితులను చేశారు. ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే సృష్టించిన యువతిని పక్షిలా మార్చి గాల్లోకి ఎగరవేయడంతో నోరెళ్లబెట్టారు. అంతటితో ఆగకుండా ఎగిరిన పక్షిని చెట్టుగా మార్చడంతో సంభ్రామాశ్చర్యాలకు గురై చప్పట్ల జడివాన కురిసేలా చేశారు.

'ఇండియన్ మ్యాజిక్ అకాడమీ (ఐఎంఏ) అవార్డ్ నైట్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు బీఎస్ రెడ్డి అధునాతన మహేంద్రజాల ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. పదిహేను నిమిషాల పాటు తన మాయజాలంతో జనాలను కట్టిపడేశారు. అకాడమీ సభ్యుడు సుదర్శన్ తన ఇంద్రజాల విద్యలతో ప్రజలను కనువిందు చేశారు. అనంతరం కువైట్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన మెజిషియన్లు గుగాంపూ, మమడాతో పాటు దేశంలోని ప్రముఖ ఇంద్రజాలకులు జూనియర్ పీసీ సర్కార్, సామ్రాజ్, భూపేష్ దావే, యోనా, చారి, కేఎస్ రమేష్, సామల వేణు, కురోలి గణేష్‌లకు గోల్డెన్ మెజిషన్ అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో చెంచూరియన్ యూనివర్శిటీ ఉపకులపతి జీఎస్ఎన్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి , గురుమూర్తి రెడ్డి, రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, మెజిషియన్లు పాల్గొన్నారు.

గాయత్రి దంత వైద్య ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రి ప్రారంభిస్తున్న ఆచార్య పి.సోమరాజు, పాల్గొన్న దక్షిణామూర్తి, రాజగణపతి తదితరులు

పెదవాల్తేరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే గాయత్రి విద్యా పరిషత్ లక్ష్యమని ఆ సంస్థ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం పెదవాల్తేరులోని గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి నగర కేంద్రంలో అయన దంత వైద్య ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నామ మాత్రపు రుసుంతో వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి, సంయుక్త కార్యదర్శి ఆచార్య పి.రాజగణపతి, సౌభాగ్యమ్మ నిర్మల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ఆచార్య విజయ రత్నం, లీలావతి, వైద్య కేంద్ర నిర్వాహకులు డాక్టర్ పద్మినీదేవి, గాయత్రి మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక జీవన శైలిలో వ్యాయామం తప్పనిసరి : సీపీ


మాట్లాడుతున్న సీపీ శంఖ్రబత బాగ్చి


వాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక జీవన శైలిలో ప్రతి ఒక్కరూ విధిగా వ్యాయామం చేయడం తప్పనిసరి అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. ఆదివారం డివైన్ టచ్ స్కూల్ ఆధ్వర్యంలో రామకృష్ణ బీచ్ వద్ద వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగా వ్యాయామం చేయడం వల్ల మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. అలాగే క్రీడల్లో కూడా రాణించేందుకు కృషి చేయాలన్నారు. చదువు వల్ల లభించే జ్ఞానం, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటూనే ఆరోగ్యపరంగా, వ్యక్తిగతంగా వికాసం సాధించాలన్నారు. సరికొత్త ఆలోచనలతో ఎప్పుడూ ముందు ఉండేందుకు పోటీ పడేందుకు ముందు ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నితాయి సేవినీ మాతాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు



కప్పస్తంభం వద్ద న్యాయమూర్తులు వై.లక్ష్మణరావు, హరిహరనాథ శర్మ

సింహాచలం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ఆదివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ప్రొటోకాల్ విభాగం ఏఈఓ వెంపలి రాంబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి, శేషవస్త్రాలను పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు చతుర్వేదస్వస్తి వచనాలతో ఆశీర్వచనాలీయగా పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

సీతాన్వేషణలో భక్తిభావం, సచ్ఛీలత చూపిన హనుమంతుడు

» ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మ జాడ కనుగొనేందుకు లంకా నగరం వెళ్లిన హనుమంతుడు ఆ నగర వైభోగం చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాడని, అయితే తాను వెళ్లిన కార్యం పట్ల మనసు సడలకుండా సీతాన్వేషణపైనే దృష్టి సారించాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా ఆదివారం సుందరకాండలోని హనుమ లంకానగరం ప్రవేశం గురించి వివరించారు. కార్యసాధనకు దేశకాలముల అనుకూలత అత్యంత ప్రధానమన్నారు. నిరుత్సాహం, నిర్వేదం పొందిన వారు ఏ కార్యం సాధించలేరన్నారు. ఉత్సాహంతో పని చేసినప్పుడు మాత్రమే కార్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. లంకానగరం శోభను చూసిన హనుమ సామ, దాన, భేద దండోపాయాలతో లంకానగరం జయించడం చాలా కష్టమని గ్రహించాడు. ఇక్కడ కార్యసిద్ధి సాధించాలంటే ముందుగా సింహావలోకనం అత్యంత అవశ్యకమని అనుకున్నాడు. పిల్లిపిల్ల అంత ఆకారంలో లంకానగరం తిరుగుతూ సీతాన్వేషణ చేపట్టారని తెలిపారు. సీతాన్వేషణలో బాగంగా లంకానగరం గాలిస్తూ పుష్పకవిమానం చూసి, అనంతరం రావణాసురుని అంతఃపురంలోకి ప్రవేశించి రావణుడి తేజస్సు చూసి ముచ్చటపడ్డాడు. రావణుడు పడుకుని ఉన్నప్పుడే ఇంత తేజస్సు కలిగి ఉన్నాడే అని ఆశ్చర్యపోయాడు. శత్రువులోని మంచి లక్షణాన్ని ప్రశంసపూర్వకంగా చూడడం హనుమంతుడి సచ్ఛీలతగా పేర్కొన్నారు. లంకానగరం అంతా వెతికినా సీతమ్మ జాడ కనపడకపోవటంతో నిరాశపడినా హనుమ.. సీతారాములను మనస్ఫూర్తిగా ప్రార్థించి మళ్లీ తన తన ప్రయత్నాని కొనసాగించి అశోకవనంతో సీత ఉన్నట్టు కనుగొన్నాడు. లంకా నగరంలో సీతాన్వేషణ చేపట్టిన సమయంలో హనుమంతుడు భక్తిభావం, సచ్ఛీలత ప్రదర్శించారని చాగంటి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

ఆరిలోవ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెదగదిలిలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం 24 వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం శివపార్వతుల కల్యాణం కన్నుల పండవగా నిర్వహించారు. ఈ కార్యక్రమం అంపోలు ఉమామహేశ్వర శర్మ వేద మంత్రాలు మంగళవాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మణశాస్త్రి పర్యవేక్షణలో జరిగింది. అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. సుమారు 5 వేల మందికి వివాహ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం 1001 బిందెలతో స్వామివారికి ప్రత్యేక పవిత్ర గంగతో అభిషేకాలు నిర్వహించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చోరీ కేసులో పోలీసులు ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకుల ఆరోపణ


ఆస్పత్రి బయట మృతుడి కుటుంబీకులు, (ఇన్‌సెట్‌లో) మృతుడు ఆనంద్ (ఫైల్)

గోపాలపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వివాదానికి దారితీసింది.స్థానిక ఇందిరానగర్‌కు చెందిన సోమేశ్ అనే ఆటోడ్రైవర్ తన ఆటోను ఏడాది క్రితం అదే ప్రాంతానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అయితే సోమేశ్ ఆటోలో ఉంచిన వ్యాలెట్ కనిపించకపోవడంతో దానిని తిరిగి ఇవ్వాలని నాగరాజును నిలదీశాడు. అయితే తనకు ఆటోలో ఎటువంటి వ్యాలెట్ దొరకలేదని నాగరాజు చెప్పడంతో వివాదం ముగిసింది. ఇదిలావుండగా నాగరాజుకు వరసకు సోదరుడైన రౌతు ఆనంద్ (30) రెండు రోజుల క్రితం ఇల్లు మారుతున్న సమయంలో ఒక వ్యాలెట్ దొరికింది. అందులో సోమేశ్‌కు చెందిన కొన్ని కార్డులు లభించాయి. దీంతో దానిని సోమేశ్‌కు ఇచ్చాడు. అయితే వ్యాలెట్ తీసుకున్న సోమేశ్ అందులోఉన్న నగదు ఇవ్వాలంటూ ఆనంద్‌ను అడిగాడు. వ్యాలెట్‌లో ఎటువంటి నగదు లేదని ఆనంద్ చెప్పాడు. దీంతో సోమేశ్ తన వ్యాలెట్ పోయిందని, ఆనంద్, నాగరాజులపై అనుమానం ఉందంటూ రెండు రోజుల క్రితం గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వారిద్దరిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆనంద్ ఉరి వేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన ఆనంద్ తల్లి కనకమహాలక్ష్మి ఉరి వేసుకుని ఉన్న కుమారుడిని చూసి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించి స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆనంద్‌మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆనంద్‌పై చోరీ ఆరోపణలు చేయడంతో పాటు సోమేశ్ పోగొట్టుకున్న నగదును ఆనంద్, నాగరాజులు ఇవ్వాలని పోలీసులు చెప్పినందునే మనస్తాపంతో ఆనంద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న గోపాలపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావును వివరణ కోరగా.. ఆనంద్, నాగరాజులపై ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. ఆనంద్ ఆత్మ హత్య చేసుకున్న విషయంపై కుటుంబీకులు చేస్తున్న ఆరోపణలపై కూడా విచారణ జరిపిస్తామని ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి బి.మురళీధర్ ఆదేశించారు. మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణపై ఆదివారం బీవీకే కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డెక్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడుతూ ఉదయం 8 గంటలకే సీఎస్‌లు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలస్యమైన విద్యార్థులకు సరైన కారణముంటే పరీక్షకు అనుమతి కల్పించాలన్నారు. ఇన్విజిలేటర్ల ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిని పరీక్షా గదుల్లోకి పంపించాలన్నారు. కచ్చితంగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో విద్యార్థులంతా పరీక్షలు రాసే విధంగా చూడాలన్నారు.

తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చా

» రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ చిత్ర హీరో ప్రదీప్ రంగనాథన్


చిత్ర నటీనటులు ప్రదీప్ రంగనాథన్, కయాదు లోహర్‌లకు స్వాగతం పలుకుతున్న డిస్ట్రిబ్యూటర్లు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): తనపై ఇంతటి ప్రేమను చూపిస్తున్న తెలుగు ప్రజలందరికీ థ్యాంక్స్ కంటే ఇంకేమీ చెప్పలేనని హీరో ప్రదీప్ రంగనాథన్ పేర్కొన్నారు. 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' చిత్రాన్ని విజయవంతం చేసిన తెలుగు ప్రేక్షకులు ఎంతో గొప్పవారని పేర్కొన్నారు. ఆయన తాజాగా నటించిన 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' చిత్ర విజయోత్సవంలో భాగంగా ఆదివారం జగదాంబ థియేటర్‌లో సందడి చేశారు. ముందుగా చిత్ర యూనిట్‌కు పూర్వీ పిక్చర్స్ అధినేత వేగి వీరునాయుడు, వేగి శ్రీనివాస్, జగదాంబ థియేటర్ అధినేత వేగి జగదీష్ కుమార్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. ఓ సాధారణ కుర్రాడు జీవితంలో ముందుకు వెళ్లాలని చేసే ప్రయత్నమే తమ చిత్ర కథాంశమన్నారు. జీవితంలో ఏదో ఒకటి సాధించాలని గట్టిగా ప్రయత్నించే ప్రతి ఒక్కరి మనస్సుల్లో తమ చిత్రం నిలిచిపోతుందన్నారు. చిత్రం విడుదలైనప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులు మంచి ఆదరణ చూపిస్తున్నారన్నారు. సినిమాను సూపర్‌సక్సెస్ చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పేందుకే ఇక్కడికొచ్చానన్నారు. చిత్రం బాగుంటే ఏ హీరోనైనా ఆదరించే గొప్ప మనస్సు ఇక్కడ ప్రజలకు ఉందన్నారు. హీరోయిన్ కయాదు లోహర్ మాట్లాడుతూ చిత్రానికి గొప్ప విజయాన్ని చేకూర్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మంచి సినిమా ద్వారా తెలుగులోని సైతం మంచి పేరు సంపాదించుకోవడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు మాట్లాడుతూ మంచి చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారని మరోసారి రుజువు చేశారన్నారు. ఆదివారం కూడా విశాఖలో హౌస్‌ఫుల్ కావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కుటుంబమంతా కలిసి చూసే చిత్రమన్నారు. మధ్యాహ్నం ప్రేక్షకులతో కలిసి వారు సినిమాను వీక్షించారు. హీరో ప్రదీప్‌తో సెల్ఫీలు దిగేందుకు కొందరు ప్రేక్షకులు ఉత్సాహం చూపారు.

ఎర్రన్నాయుడుకి నివాళి


ఎర్రన్నాయుడికి నివాళి అర్పిస్తున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పనాయుడు, పాలమరశెట్టి శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడుకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పనాయుడు, టీడీపీ విశాఖ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావును నివాళులర్పించారు. ఎర్రన్నాయుడు జయంతిని పురస్కరించుకుని జిల్లా తెలుగుదేశం కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూల మాల వేశారు. ఎర్రన్నాయుడుతో ఉన్న అనుబంధాన్ని అప్పలనాయుడు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాజిద్దున్, హరి, బల్లి మధు, శివ, బొబ్బిలి శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిడిజాలలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎంపీ శ్రీభరత్

ఆనందపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం గిడిజాలలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు గంటా రవితేజ, మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు పాండ్రంకి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సినగం అప్పలరాజు, మాజీ సర్పంచ్ కోరాడ రాము, ఇంకా బోసుబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిజిటల్ భద్రత ఎంతో ముఖ్యం

» 'గీతం' వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కనెక్టివిటీ పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ భద్రత ఎంతో ముఖ్యమైనదని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా అన్నారు. ఆదివారం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తన అనే అంశంపై ప్రమోషన్ ఆఫ్ అకడమిక్, రీసెర్చ్ కొలాబరేషన్ (స్పార్క్) వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ సురక్షితంగా ఇంటర్నెట్‌ను వాడడంలో అవగాహన, నైపుణ్యాలను అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సాంకేతికతను సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించేందుకు ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ స్పార్క్‌ప్రాజెక్టు జాతీయ సంయుక్త కో-ఆర్డినేటర్, అంతర్జాతీయ సంబంధాల డీన్, కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ రబీబ్రత ముఖర్జీ మాట్లాడుతూ సైబర్ భద్రతా విద్య, సురక్షిత ఇంటర్నెట్ ప్రవర్తనను ప్రోత్సహించడం ద్వారా వ్యక్తులు, సంస్థలను డిజిటల్ ముప్పుల నుంచి రక్షించవచ్చన్నారు. స్పార్క్ ప్రాజెక్ట్ రష్యన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ ప్రొఫెసర్ అడ్వర్‌పట్రకోవ్ వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో గీతం హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ విభూతిసచ్‌దేవ్, డాక్టర్ లియాడ్మిలాబటురినా, డిజిటల్ పర్యావరణం, యువతకు ముప్పు అనే అంశంపై మాట్లాడారు.

నామినేటెడ్ పదవుల్లో గీత కార్మిక కులాలను విస్మరించారు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన వివిధ విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, నామినేటెడ్ పదవుల్లోనూ గీత కార్మిక కులాలను విస్మరించారని ఆ వర్గం కులాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం ఆదర్శనగర్‌లో నిర్వహించిన నాయకుల సమావేశంలో విశాఖ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు గుత్తుల మధుసూదనరావు, నాయకులు రేఖల కృష్ణ గౌడ్, ఆచార్య వివేకానంద మూర్తి, గుత్తుల వెంకటేశ్వరరావు, సంతోష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న గీత కార్మిక వర్గాలను విస్మరించడం విచారకరమన్నారు. నామినేటెడ్ పదవుల్లో అధిక విద్యావంతులున్న తమ వారికి ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు. గత ఎన్నికల్లోనే కాకుండా టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి కృషి చేస్తున్న విషయం పాలకులు గమనించాలని కోరారు.

అనంతపురం నుంచి టమాటాల దిగుమతి



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాలు పరిశీలిస్తున్న అధికారులు

సీతమ్మధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతు బజార్‌కు అనంతపురం నుంచి ప్రభుత్వం టమాటాను సరఫరా చేయడంతో అమ్మకాలపై మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస్ కిరణ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్‌లు ఆదివారం పరిశీలించారు. సీతమ్మధార రైతుబజార్‌కు ప్రభుత్వం అనంతపురం నుంచి ఆదివారం రెండు టన్నుల టమాటాను రైతులకు సరఫరా చేశారు.

రెండుచోట్ల వైద్య శిబిరాలు



వాకర్స్ క్లబ్‌లో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం కేర్, హెచ్‌సీజీ ఆసుపత్రులు సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశాయి. ఉదయం 6.30 గంటల నుంచి వాకర్స్ క్లబ్ కళా వేదికలో వైద్య సిబ్బంది ఆర్థోపెడిక్, ఆర్‌బీఎస్, శరీర బరువుకు తగ్గట్టుగా ఆరోగ్య ప్రమాణాల చికిత్సలు చేపట్టారు. వైద్యులు విజయ్ ఆదిత్య, రఘు, రేవంత్, సహాయక సిబ్బంది చికిత్సలు అందించారు. ఆరోగ్య పరిరక్షణకు వచ్చిన వారికి తగిన సూచనలు ఇచ్చారు. వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సి.హెచ్.ఎస్.ఎస్.వి.ప్రసాదరావు, కమిటీ సభ్యులు వైద్య శిబిరం నిర్వహణ ఏర్పాట్లు చేశారు. మాధవధార, ఎన్‌జీజీఓస్ కాలనీ, కైలాసపురం, మర్రిపాలెం ప్రాంతాల నుంచి 164 మంది చికిత్సలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రైల్వే న్యూకాలనీలో...

అల్లిపురం: గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ టీకే శశికళ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 130 మందికి ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కె.యశ్వంత్ వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



కళింగనగర్‌లో రూపుదిద్దుకున్న రోడ్డు డివైడర్

మాధవధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నుంచి మాధవధార ఉడాకాలనీ వరకు నవీకరించిన 48ఎ బస్‌రూట్‌లో ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. నిరుడు ఫిబ్రవరిలో ఎన్నికల హడావిడి నేపథ్యంలో రోడ్లు, కొత్త నిర్మాణాలకు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. ఈ క్రమంలో సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మాధవధార ఉడాకాలనీ దాటి ఆర్‌అండ్‌బీ జంక్షన్ వరకు రూ.9 కోట్లు వెచ్చించి తారు రోడ్లు నిర్మించారు. కొత్తగా మెరుస్తున్న రోడ్లపై వాహనదారులు శృతిమించిన వేగంతో దూసుకెళ్తూ ప్రయాణికులు, నివాసితులు, బాటసారులకు దడ పుట్టిస్తున్నారు. మురళీనగర్, మాధవధారలో ప్రమాదాలు జరుగుతున్న చోట ఆదివారం డివైడర్లు నిర్మించారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగం గుర్తించిన చోట కాంట్రాక్టు సిబ్బంది వేగ నియంత్రణకు బ్రేకర్లు వేస్తున్నారు. ఈ దారిలో 48ఎ, 48ఎస్ బస్సుల కోసం వేచి ఉండే వారికి, పాదచారులకు, ప్రయాణికులకు భద్రత లభిస్తుంది.

రఘువర్మకు మద్దతుగా టీడీపీ ప్రచారం

సీతమ్మధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఎంపీ శ్రీభరత్ సూచనతో ఉత్తర నియోజకవర్గం 24వ వార్డులో టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, వార్డు అధ్యక్షుడు బర్ల బాలకృష్ణ, వి.భరత్ తదితరులు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ఓటు అభ్యర్థించారు. 14వ వార్డులో టీడీపీ నాయకులు గొంప ధర్మారావు, వసంతరావులు ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ వెంకటరావు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పలు కేసులలో నిందితులుగా ఉండటంతో రౌడీషీట్ తెరిచామని, ఇకనైనా మంచి బుద్ధితో మెలగాలని నాలుగో పట్టణ ఎస్ఐ వెంకటరావు హితవు పలికారు. అసాంఘిక కార్యకలాపాలకు, తగవులకు, శాంతిభద్రతలకు విరుద్ధంగా నడుచుకుంటే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ దాలిబాబు పర్యవేక్షణలో ఆదివారం స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల్లో క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించడం కీలకం



క్యాన్సర్ నుంచి కోలుకున్న చిన్నారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లను సకాలంలో గుర్తించడం ద్వారా పూర్తిగా కోలుకునేలా చేయవచ్చని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలల క్యాన్సర్ దినం నేపథ్యంలో అక్కయ్యపాలెంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌లో ఇన్‌స్పైరింగ్ యాక్షన్-2025 పేరుతో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ బారినపడి కోలుకున్న చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు, వైద్య నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వి.మురళీ కృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ల నుంచి కోలుకున్న చిన్నారులకు భవిష్యత్‌లో అవసరమైన సహకారం అందించడం కీలకమన్నారు. డాక్టర్ వై.రాజనీప్రియ మాట్లాడుతూ పిల్లలు, వారి కుటుంబ సభ్యులకు మానసిక, భావోద్వేగ సహాయం నిరంతరం అందించాలన్నారు. డాక్టర్ బాలా స్టాలిన్ చౌదరి మాట్లాడుతూ పీడియాట్రిక్ అంకాలజీలో సాధించిన పురోగతి, సమానమైన వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. డాక్టర్ ప్రవీణ వున్నా మాట్లాడుతూ కుటుంబ సభ్యుల తోడ్పాటుతోనే చిన్నారులు క్యాన్సర్‌పై విజయం సాధించగలరన్నారు. ఈ సందర్భంగా వినోద కార్యక్రమాలు నిర్వహించారు.

ముదిమి వయసులో.. తరగతి గదిలో..

- 60 ఏళ్ల తరువాత కలుసుకున్న అలనాటి విద్యార్థులు
- సెయింట్ ఆంథోనీ పాఠశాల వేదిక



సెయింట్ ఆంథోని పాఠశాల కళా వేదికపై పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు



నాడు తాము చదువుకున్న తరగతి గదిలో..

మహారాణిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల కిందట కలిసి చదువుకున్న స్నేహితులు.. ఇప్పుడు ఆ పాఠశాలలోనే కలుసుకుని సంబరాలు చేసుకున్నారు. విశాఖపట్నంలో సుప్రసిద్ధ సెయింట్ ఆంథోని పాఠశాలలో ఆదివారం ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. మహారాణిపేటలో ఉన్న సెయింట్ ఆంథోని పాఠశాలలో 1965లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు 60 ఏళ్లు నిండిన సందర్భంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో ల్యాండ్‌లైన్ ఫోన్లు కూడా అందరికీ లేవు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఒక్కరొక్కరుగా చిరునామాలు, సెల్‌ఫోన్ నంబర్లు సేకరించి, వాట్సాప్ గ్రూపును ఏర్పాటుచేసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన సుమారు 40 మంది విశాఖ వచ్చి, ఆదివారం సెయింట్ ఆంథోని పాఠశాలలో కలుసుకున్నారు. అందరి వయసు ఇంచుమించు 75 సంవత్సరాలు. ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. సంతోషంతో ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. నాడు చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగారు. కొద్దిసేపు చిన్నపిల్లలుగా మారిపోయారు. అప్పటి సంగతులు, విశేషాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత స్థితిగతులు, పిల్లలు, వారి కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. వృద్ధాప్యంతో మరణించిన తోటి స్నేహితులను తలచుకున్నారు. నాడు వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఇప్పుడు జీవించి లేకపోయినా, ఈ పాఠశాలలో పనిచేసి రిటైరైన ఓ ఉపాధ్యాయుడిని ఆహ్వానించి సన్మానించారు. అందరూ కలిసి మధ్యాహ్న భోజనం ఆరగించారు. గ్రూపు ఫొటో దిగారు.

'సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం'



సమావేశంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అల్లిపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా, ఇదే వైఖరి అవలంబిస్తే ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో పి.శేఖర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కొన్ని తీర్మానాలు ఆమోదించినట్లు జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ అరికట్టాలని, పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్, ప్రైవేట్ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. విద్యార్థులను చైతన్యపరిచేందుకు విశాఖ వేదికగా మే నెలలో విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, కోశాధికారి భవాని, కంజీర పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



రైల్వే న్యూకాలనీ పరీక్షా కేంద్రంలో అభ్యర్థులు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షలు ఆదివారం తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల్లో రోస్టర్ విధానాన్ని సవరించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు నిరసన తెలుపుతారనే అనుమానంతో పోలీసులు పరీక్షా కేంద్రం ఎదుట గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి 144వ సెక్షన్ విధించారు. కానీ అలాంటివి లేకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షా కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కేంద్రంలో 480 మంది రాయాల్సి ఉండగా 357 మంది హాజరయ్యారు. పరీక్ష రాసేందుకు ఉత్సాహంగా వచ్చిన ఇద్దరు అభ్యర్థులకు నిరాశే ఎదురైంది. శ్రీకాకుళం, విశాఖ నగరానికి చెందిన వీరు ఆలస్యంగా రావడంతో లోపలకు అనుమతించలేదు.

'ప్రజలను హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నల్లమోతు రాధాకృష్ణ తదితరులు

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘం మహాసభలను ఆదివారం ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సంఘం కార్యవర్గ సభ్యుడు ఆర్.జగపతిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా 'విశ్వతత్వం-విశ్వపరిణామం' అనే అంశంపై భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ ప్రసంగించారు. విశ్వం.. ఆది అంతాలు లేనిదని, నియమబద్ధంగా పరిణమిస్తుందన్నారు. కుల మతాలు, జాతులు, వర్గాల జాడ్యం నుంచి మానవాళిని బయటకు తెచ్చి హేతుబద్ధంగా ఆలోచింప చేయాలన్నారు. పరస్పర సహకారంతో మానవాభివృద్ధి సాధ్యమన్నారు. వైజ్ఞానిక వికాసం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన 'హేతువాద మానవవాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి' పుస్తకాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ట్రెజరర్ నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి సమీక్షించారు. సంఘం నూతన అధ్యక్షులుగా ఆర్.జగపతిరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.పాండురంగారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటి రాజశేఖర్, రాంప్రభు, ఎ.సత్యనారాయణ, సురేష్, షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.

'శెట్టిబలిజల అభ్యున్నతికి కృషి చేస్తా'



కట్టా మల్లేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని, శెట్టిబలిజ, కట్టాస్, గౌడ, శ్రీశైన, యాత కులాలు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలని బీసీ సమన్వయ కమిటీ, శెట్టిబలిజ, కట్టాస్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో శెట్టి బలిజ కట్టాస్ వివాహ పరిచయ వేదిక, పలువురికి ఆర్థిక చేయూత అందించే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ ఒకచోట కలుసుకోవడం సంఘం బలోపేతానికి దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా జైశెట్టిబలిజ ప్రతినిధి విజయ్‌కుమార్‌కి కట్టా మల్లేశ్వరరావు రూ.25 వేల చెక్కును అందచేశారు. అనంతరం నిర్వాహకులు కట్టా మల్లేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు కట్టా శ్రీనివాస్, గ్రాండ త్రినాథ్, పాలిక శ్రీనివాస్, స్టాలిన్, ఇళ్ల వెంకటేశ్వరరావు, వెంద్రా త్రినాథ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి గేటు ఏర్పాటు



కార్యాలయం ప్రవేశ మార్గం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప గేటు

మురళీనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి); విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ మాధవధార హైవే రోడ్డులోని కార్యాలయం వద్ద కొత్త ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసుకున్నారు. పలుమార్లు డిపార్ట్‌మెంట్‌కి విన్నపాలు చేసినా, పని జరగకపోవడంతో ఆర్‌అండ్‌బీ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సొంత నిధులతోనే అకౌంట్స్ సెక్షన్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద కొత్త ఐరన్ గేట్ ఏర్పాటు చేశారు. దాదాపు రూ.40 వేలు ఖర్చు చేసి ఈ కొత్త గేటు అమర్చారు. చీకటి పడగానే ఆకతాయిల బెడద ఉండేది. వాచ్‌మన్ కుటుంబంతో వాగ్వాదాలకు దిగుతున్న మందుబాబుల బెడదను అరికట్టేలా రక్షణ కోసం ప్రవేశంలో కొత్త గేటు అమర్చారు. హైవే రోడ్డులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను ఆనుకొని ఉన్న ఈ కార్యాలయం దాదాపు ఎకరం స్థలంలో విస్తరించి ఉంది. 1994లో కట్టిన ఈ బిల్డింగ్ ఆరంభమైన తొలినాళ్లలో ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ విభాగం కోసం కేటాయించారు. తరువాత పలు విభాగాలకు కేటాయిస్తూ వచ్చారు. ఇపుడు ఈ భవంతిలో రహదారులు, భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు విశాఖపట్నం డివిజన్ సూపరింటెండెంట్, అకౌంట్స్ స్టాఫ్ అంతా కలిపి 20 మంది వరకు విధులు నిర్వర్తిస్తున్నారు.

శివరాత్రి జాగరణ స్నానాలకు ఏర్పాట్లు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా ఆ రోజు జాగరణ స్నానాలు చేసే భక్తుల కోసం సాగర్‌నగర్ తదితర బీచ్‌లలో జీవీఎంసీ విద్యుత్ దీపాలను ఆదివారం ఏర్పాటు చేసింది. శివరాత్రి రోజు భక్తులు జాగరణ చేసి తెల్లవారు జామున సముద్ర స్నానాలకు వేలాదిగా తీరాలకు చేరుకోవడం ఆనవాయితీ. చీకటిలో భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు బీచ్‌లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. భక్తులు వస్త్రాలు మార్చుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఆ రోజు స్వచ్ఛంద సంస్థలు వారికి తోచిన సహాయం భక్తులకు చేస్తుంటారు. నగరంలోని ఆర్‌కే బీచ్ మొదలుకొని భీమిలి తీరం వరకు ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు చేస్తుంటారు. ప్రమాదకర ప్రాంతాల్లోనూ, ఎక్కువమంది భక్తులు చేరుకునే బీచ్‌ల వద్ద అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నీటి వృథా..కానరాదా?



ట్యాంకరు నిండి రోడ్డుపై వృథాగాపోతున్న నీరు

మాధవధార, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విమానాశ్రయం నుంచి తాటిచెట్లపాలెం వరకు ఉన్న హైవే సెంటర్ డివైడర్‌లో మొక్కల సంరక్షణకు కేటాయించిన నీటి నిల్వ కేంద్రం వద్ద తరచూ జలం వృథా అవుతోంది. ఇక్కడ నుంచే జీవీఎంసీ సిబ్బంది నిత్యం ట్యాంకర్లతో నీటిని పట్టుకుని పైపులతో మొక్కలకు అందిస్తుంటారు. ఈ క్రమంలో ఇక్కడ నీటిని పట్టే కేంద్రం దగ్గర వాహన డ్రైవర్లు ట్యాంకర్లలో నింపే సమయంలో అవి నిండి రోడ్డంతా నీరు పారడం నిత్యకృత్యంగా మారుతోంది. ఈ ఏడాది ఎండాకాలం తీవ్రంగా ఉంటుందన్న సమాచారంతో నీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని బెంబేలెత్తుతున్న జనం, ఈ వృథాను చూసి అవాక్కవుతున్నారు. ఈ ఫిల్లింగ్ పాయింట్ నిర్వహణకు ప్రత్యేకించి సిబ్బంది ఎవరూ ఉండరు. వాహనాలను తీసుకొచ్చిన డ్రైవర్లు ట్యాంకర్లు నింపడం, అవి నిండే దాకా పక్కనే ఉన్న హైవే గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో సేద తీరడం రివాజుగా మారింది. వారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ట్యాంకర్ నిండి నీరు వృథా అవుతోంది. ఎవరైనా అప్రమత్తం చేశాక నీటి వృథాను అరికట్టి నింపాదిగా మొక్కలకు నీరు పెడుతుంటారు. మాధవధార పంప్‌హౌస్, జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాషువా నగర్ రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు



జాషువా నగర్ ప్రధాన రహదారిపై ఓవైపు దుకాణాలు, మరోవైపు నిలిపిన వాహనాలు

కంచరపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వవార్డు పరిధి జాషువానగర్ ప్రధాన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ జామ్‌తో స్థానికులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గంలో ఇరువైపులా తోపుడు బళ్లు, వర్తకుల దుకాణాలతో నిండిపోతుంది. అసలే ఇరుకు మార్గం కావడంతో పాటు కొండవాలు గ్రామాల నుంచి వచ్చే వాహనాలన్నీ ఇలాగే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. సమీపంలో సచివాలయ సిబ్బంది ఉన్నా పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కంచరపాలెం మెట్టు బస్టాప్ నుంచి అశోక్‌నగర్ జాతీయ రహదారి వరకు ఇదే పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో 108 వంటి వాహనాలు కూడా ఈ మార్గంలో రాలేని దుస్థితి ఉంటుందంటే ఇక్కడ రోడ్డు ఏమేరకు ఆక్రమణలతో నిండిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు, ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.

విస్తరిస్తున్న డ్రగ్స్ కల్చర్

... 5వ పేజీ తరువాయి

బ్రౌన్‌షుగర్‌ను సాగర్‌నగర్ వద్ద వేరొకరికి అందజేసే ప్రయత్నంలో టాస్క్‌ఫోర్స్, ఆరిలోవ పోలీసులు దాడిచేసి అతడ్ని అదుపులోకి తీసుకుని, బ్రౌన్‌షుగర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇలా డ్రగ్స్‌తో పోలీసులకు పట్టుబడినవారు కొద్దిమందే ఉన్నప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్న వారి సంఖ్య నగరంలో భారీగా ఉంటుందని పోలీసులే చెబుతుండడం పరిస్థితికి అద్దం పడుతోంది.

ప్రత్యేక కోడింగ్‌తో సరఫరా, విక్రయం

సింథటిక్ డ్రగ్స్‌ను ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తీసుకొచ్చేవారు వాటిని ప్రత్యేక కోడింగ్ ద్వారా ఇతరులకు అందజేస్తున్నారు. సింథటిక్ డ్రగ్స్‌ను నగరానికి దిగుమతిచేసుకునేవారికి, ఇతర రాష్ట్రాల్లో వాటిని సరఫరాచేసేవారికి ప్రత్యక్షంగా ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం తమకు కావాల్సిన సరుకు వివరాలను సరఫరాదారుడికి చెబితే, సుపారీకి పనిచేసే కొరియర్‌ల ద్వారా నగరానికి పంపిస్తున్నారు. కొరియర్‌లకు కూడా నగరంలోకి వచ్చినంతవరకు ఎవరికి వాటిని చేరవేయాలనేది తెలియదు. నగరానికి చేరిన తర్వాత వారిని ఒక ప్రాంతానికి చేరుకోవాలని చెప్పి, ప్రత్యేక డ్రెస్ కోడ్ లేదంటే ఇతర ఆనవాళ్లను ప్రదర్శించాలని చెబుతారు. దిగుమతిదారులకు కూడా ఒక ప్రాంతానికి వెళ్లి అక్కడ ఫలానా డ్రెస్ లేదంటే ఇతర ఆనవాళ్లతో ఉన్నవారిని కలవాలని చెబుతారు. అక్కడకు వెళ్లిన తర్వాత కొకైన్ అయితే 'కే' అని, బ్రౌన్‌షుగర్ అయితే 'బి' అని ఇలా ఒక కోడ్ చెప్పి పరిచయం చేసుకుంటారు. కొరియర్‌కు డ్రగ్ సరఫరాచేసిన వ్యక్తి చెప్పిన కోడ్‌కు, సరుకు తీసుకెళ్లేందుకు వచ్చిన వ్యక్తి పలికిన కోడ్ సరిపోతే ఆ సరుకుని అతనికి అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోతారు. దీనివల్ల కొరియర్ పోలీసులకు పట్టుబడినాసరే ఎవరు పంపించారు, ఎవరికి అందజేయాలనే వివరాలు బయటపడే అవకాశం ఉండదు. ఇలా దిగుమతి చేసుకున్న డ్రగ్స్‌ను నగరంలో తమకు పరిచయస్తులైనవారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక రవాణాలో అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

ప్రాసెస్ జరగదు. కానీ తప్పుడు మార్గంలో వెళ్లి నకిలీ వే బిల్లులు తయారుచేసి విశాఖకు ఇసుక తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు తనిఖీల సమయంలో నకిలీ వేబిల్లులు గుర్తుపట్టలేకపోవడంతో డ్రైవర్లు వందల లారీల నకిలీ వేబిల్లులతో ఇసుక తోలేశారు. కేవలం గనులు శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తే మాత్రమే నకిలీ వే బిల్లులు గుర్తించి పట్టుకుంటున్నారు. ఇలా రెండు నెలల్లో పదుల సంఖ్యలో నకిలీ వేబిల్లులతో లారీలు పట్టుకుని జరిమానా విధించారు.

దాడులపై ముందస్తు సమాచారం

గనులశాఖ అధికారులు దాడులు చేస్తారన్న విషయం ముందుగానే తెలుసుకుంటున్న లారీ డ్రైవర్లు అప్రమత్తమై రీచ్‌ల వద్దే ఉండిపోతున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వరకు దారి పొడవునా ప్రతిరోజూ గనులశాఖ, విజిలెన్స్ అధికారులు లారీలు తనిఖీ చేయడం సాధ్యం కాదు. అందువల్ల దాడులు చేయని రోజుల్లో ఎక్కువగా నకిలీ బిల్లులతో ఇసుక నగరానికి తరలిస్తున్నారు.

నదులకు ఆనుకుని కొన్ని గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వి పొలాలు, కళ్లాల్లో నిల్వచేస్తున్న ఇసుకను కొందరు కొనుగోలుచేసి నకిలీ వేబిల్లులతో విశాఖకు తీసుకువస్తున్నారు. నగరంలో రిటైల్ వ్యాపారులు, బిల్డర్లకు ఇసుక సరఫరాచేసే కొందరు తమకు తెలిసిన లారీ డ్రైవర్ల ద్వారా నకిలీ వేబిల్లుల బాగోతం నడుపుతున్నారు. ఇసుక తరలింపునకు నామమాత్రపు రుసుం మాత్రమే వసూలు చేసే వీలుంది. అది కూడా రీచ్‌ల నిర్వహణకు మాత్రమే తీసుకుంటున్నారు. అయినా కొందరు సిబ్బంది రీచ్ నిర్వాహకులకు టోపీ పెట్టి లారీ డ్రైవర్లతో మిలాఖత్ అయి ఇసుక తరలిస్తున్నారు. ఇటువంటి అక్రమాలకు తెరదించాలంటే అన్ని శాఖలతో బృందాలను ఏర్పాటుచేసి నిరంతరం నిఘా ఉంచాలని గనులశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్తగా కన్నబాబు

... 5వ పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఎనిమిది నెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పరపతిని కోల్పోయిందని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని జిల్లాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. రాష్ట్రంలో కూటమి పార్టీల కంటే వైసీపీ బలంగా ఉందన్నారు. ఒక్క గ్యాస్ మినహా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏదీ అమలుచేయలేదన్నారు. అయినప్పటికీ రూ.1.2 లక్షల కోట్లు అప్పుచేశారని ఎద్దేవా చేశారు.

ఫుడ్ లేబొరేటరీ సేవలందేనా?

... 5వ పేజీ తరువాయి

జిల్లాల ఆహార, భద్రతా ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీల సందర్భంగా సేకరించిన నమూనాలను ఈ లేబ్‌కు పంపుతున్నారు. వాటిని అక్కడి సిబ్బంది అనాలసిస్ చేసి రిపోర్టులు ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటారు. అయితే విశాఖలో లేబ్ అందుబాటులోకి రాకపోవడంతో ఇప్పటికీ అధికారులు హైదరాబాద్‌కు నమూనాలు పంపిస్తున్నారు. అక్కడి నుంచి ఫలితాలు రావడానికి కనీసం పది నుంచి నెల రోజుల సమయం పడుతోంది. దీంతో నిందితులపై సకాలంలో చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఈశాఖ పనితీరుపైనా తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.

ఇన్‌స్టాల్ చేయని పరికరాలు

లేబ్‌లో ఆయిల్స్, ఆహారం, పప్పులు, పాలు, పాల ఆధారిత పదార్థాలు, చాక్లెట్స్, బిస్కెట్స్, సాఫ్ట్ డ్రింక్ వంటి 17 సెక్షన్స్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన 30 రకాల పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికీ వీటిని పూర్తిస్థాయిలో ఇన్‌స్టాల్ చేయలేదు. ఇక్కడ పనిచేసేందుకు వివిధ కేడర్లకు చెందిన సుమారు 80 మంది సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇప్పటివరకు ప్రారంభించలేదు. దీంతో స్టేట్ ఫుడ్ లేబ్ సేవల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

చికెన్ షాపులు వెలవెల.. చేపల బజార్లు కళకళ

- కోడి మాంసం అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో డీలాపడిన వ్యాపారులు
- జోరుగా సాగుతున్న మటన్ అమ్మకాలు





కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న గోపాలపట్నంలోని చేపల బజారు. (ఇన్‌సెట్లో) ఖాళీగా ఉన్న చికెన్ షాపు

గోపాలపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు మృత్యువాత పడడంతో ఆ ప్రభావం విశాఖ జిల్లాపై కూడా పడింది. దీంతో గత రెండు వారాలుగా చికెన్ విక్రయాలు సరిగ్గా జరగకపోవడంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సాధారణంగా నగరంలో నిత్యం టన్నుల కొద్దీ కోడి మాంసం వినియోగం జరుగుతుంది. గృహావసరాలతో పాటు రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో చికెన్ వినియోగమే అధికంగా ఉంటుంది. ముఖ్యంగా ఆదివారం రోజు చికెన్ వినియోగం మరింత అధికంగా ఉంటుంది. జీవీఎంసీ పరిధిలోని దుకాణాలు, హోటళ్లల్లో ఆదివారం ఒక్కరోజే సుమారు 200 టన్నుల కంటే ఎక్కువగానే కోడిమాంసం విక్రయాలు జరుగుతాయని అంచనా. అయితే బర్డ్‌ఫ్లూ కలకలం నేపథ్యంలో నగరంలోని ప్రజలు కూడా చికెన్ షాపుల వైపు కన్నెత్తయినా చూడడం లేదు. దీంతో వీటి అమ్మకాలు బాగా పడిపోయాయి. ఆదివారం కూడా కోడిమాంసం దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. ఆదివారం రోజు కూడా చికెన్ విక్రయాలు పది శాతం కూడా జరగలేదని వర్తకులు వాపోతున్నారు. జిల్లాలోని కోళ్ల ఫారాల్లో బర్డ్‌ఫ్లూ ప్రభావం పడకుండా యజమానులు వైద్యుల సలహాలు పాటిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కేసులు ఎక్కడా నమోదు కాలేదు. బర్డ్‌ఫ్లూ ప్రభావిత ప్రాంతాల్లో తప్పా ఇతర ప్రాంతాల్లో చికెన్ వినియోగించడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు ప్రకటనలు కూడా చేశారు. అయినప్పటికీ సామాజిక మాధ్యమాల ప్రభావం అధికంగా ఉండడంతో ఆ ఎఫెక్ట్ చికెన్ అమ్మకాలపై పడింది. దీంతో చికెన్ విక్రయాలు జరగక వ్యాపారులు డీలా పడ్డారు.

జోరందుకున్న చేపలు, మటన్ విక్రయాలు

బర్డ్‌ఫ్లూ కలకలం నేపథ్యంలో నగరంలో చికెన్ విక్రయాలు పడిపోవడంతో మటన్, చేపల విక్రయాలు జోరందుకున్నాయి. సాధారణ రోజుల్లో చెరువు చేపలు కిలో రూ.130 లభించేవి. ప్రస్తుతం వీటి ధర కిలో రూ.200కి చేరింది. కాగా నగరంలోని ఫిషింగ్ హార్బర్‌లో లభించే చేపల ధరలు కూడా పెరగడంతో రిటైల్ వర్తకులు కూడా చేపలను అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ ప్రభావం వల్ల మటన్ విక్రయాలు కూడా భారీగానే పెరిగాయి. ప్రజలు మటన్ దుకాణాల బాట పట్టడంతో గొర్రెలు, మేకల కొరత ఏర్పడి కొన్నిచోట్ల కిలో మటన్ రూ.1000కి పైగానే విక్రయిస్తున్నారు.

రైతులకు అండగా ఐడీఎస్ఏపీ

- ఎండాడ వద్ద ఐదెకరాల్లో కార్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయింపు
- సంస్థ డైరెక్టర్ ఆచార్య ఎస్.గలాబ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు అండగా ఇనిస్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐడీఎస్ఏపీ) పరిశోధనలు చేస్తోందని ఆ సంస్థ డెరెక్టర్ ఆచార్య ఎస్.గలాబ్ తెలిపారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈ సంస్థ హైదరాబాద్‌లో ఉండేదని, రాష్ట్ర విభజన తరువాత ఇక్కడ ఏర్పాటైందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య రొక్కం రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో సంస్థ మనుగడ ప్రారంభమైందని గలాబ్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ఆధారంగా రైతులకు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వాలనే ప్రాజెక్టు ప్రస్తుతం కొనసాగిస్తున్నామన్నారు. అన్నదాతలకు సేంద్రీయ వ్యవసాయం, పంటల మార్పిడి, చీడపీడలు, భూసార పరీక్షలు తదితర వాటిపై క్షేత్రస్థాయిలో తమ సంస్థ బృందాలు పరిశోధనలు చేసి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ఖరీఫ్, రబీ, లతో పాటు ఖరీఫ్, రబీ కలిపి పంటలకు సంభందించి ప్రతీఏటా మూడు నివేదికలను తమ బృందం సభ్యులు అధ్యయన పత్రాలు వ్యవసాయశాఖ అధికారులకు అందిస్తుందన్నారు. వాటి ఆధారంగా సేద్యం చేస్తే రైతులకు ఆర్థికంగా కలసి వస్తుందని గలాబ్ వివరించారు.తమ సంస్థ కార్యకలాపాలు కోసం నిధులు, భూ వనరులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇటీవల విజ్ఞప్తి చేశామని, ఆయన సానుకూలంగా స్పందించి నిధులు కేటాయిస్తామని తెలిపినట్టు గలాబ్ చెప్పారు. ఎండాడ సర్వే నంబరు 179/6లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని (దిశ పోలీస్‌స్టేషన్ పక్కన) ప్రభుత్వం ఐడీఎస్ఏపీకి కేటాయించిందని తెలిపారు. భూమి స్వాధీన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు.

25న ఏయూలో సదస్సు

సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఆచార్య రొక్కం రాధాకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గలాబ్

జ్ఞాపకార్థం ప్రపంచ వ్యాప్తంగా సెమినార్లు ఏర్పాటు నిర్వహించామని, ఇందులో భాగంగా మంగళవారం ఆంధ్రాయూనివర్శిటీలోని డాక్టర్ వీఎస్ మూర్తి ఆడిటోరియంలో సదస్సు నిర్వహించనున్నట్టు గలాబ్ తెలిపారు.

ఈ సదస్సులో మాజీ ఆర్‌బీఐ గవర్నర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు సాయంత్రం నాలుగు గంటలకు 'డైలిమ్మాస్ ఇన్ సెంట్రల్ బ్యాంకింగ్ రిఫ్లెక్షన్స్ ఆన్ హౌ ది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కనెక్ట్ విత్ పీపుల్స్ ఎవ్రిడే లైఫ్' అనే అంశంపై ప్రసంగిస్తారని గలాబ్ తెలిపారు. విలేకరుల సమావేశంలో సంస్థ ఓఎస్‌డీ ఆచార్య జె.రామునాయుడు, సీనియర్ కన్సల్టెంట్ ఆచార్య సి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చోరీ కేసులో పోలీసులు ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకుల ఆరోపణ



ఆత్మహత్య చేసుకున్న ఆనంద్ (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వివాదానికి దారి తీసింది. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన సోమేశ్ అనే ఆటోడ్రైవర్ తన ఆటోను ఏడాది క్రితం అదే ప్రాంతానికి చెందిన నాగరాజు అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అయితే సోమేశ్ ఆటోలో ఉంచిన వ్యాలెట్ కనిపించకపోవడంతో దానిని తిరిగి ఇవ్వాలని నాగరాజును నిలదీశాడు. అయితే తనకు ఆటోలో ఎటువంటి వ్యాలెట్ దొరకలేదని నాగరాజు చెప్పడంతో వివాదం ముగిసింది. ఇదిలావుండగా నాగరాజుకు వరసకు సోదరుడైన రౌతు ఆనంద్ (30) రెండు రోజుల క్రితం ఇల్లు మారుతున్న సమయంలో ఒక వ్యాలెట్ దొరికింది. అందులో సోమేశ్‌కు చెందిన కొన్ని కార్డులు లభించాయి. దీంతో దానిని సోమేశ్‌కు ఇచ్చాడు. అయితే వ్యాలెట్ తీసుకున్న సోమేశ్ అందులో ఉన్న నగదు ఇవ్వాలంటూ ఆనంద్‌ను అడిగాడు. వ్యాలెట్‌లో ఎటువంటి నగదు లేదని ఆనంద్ చెప్పాడు. దీంతో సోమేశ్ తన వ్యాలెట్ పోయిందని, ఆనంద్, నాగరాజులపై అనుమానం ఉందంటూ రెండు రోజుల క్రితం గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు వారిద్దరిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆనంద్ ఉరి వేసుకున్నాడు. బయటకు వెళ్లి వచ్చిన ఆనంద్ తల్లి కనకమహాలక్ష్మి ఉరి వేసుకుని ఉన్న కుమారుడిని చూసి వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించి స్థానిక 30 పడకల ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆనంద్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

ఆనంద్‌పై చోరీ ఆరోపణలు చేయడంతో పాటు సోమేశ్ పోగొట్టుకున్న నగదును ఆనంద్, నాగరాజులు ఇవ్వాలని పోలీసులు చెప్పినందునే మనస్తాపంతో ఆనంద్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. కాగా విషయం తెలుసుకున్న గోపాలపట్నం పోలీసులు ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టానికి తరలించారు. దీనిపై గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావును వివరణ కోరగా.. ఆనంద్, నాగరాజులపై ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారన్నారు. ఆనంద్ ఆత్మహత్య చేసుకున్న విషయంపై కుటుంబీకులు చేస్తున్న ఆరోపణలపైనా విచారణ జరిపిస్తామని ఆయన పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన కర్రి ప్రవీణ్ (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్కిరెడ్డిపాలెం వద్ద చోటు చేసుకుంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కిరెడ్డిపాలేనికి చెందిన కర్రి ప్రవీణ్ (27) జాతీయ రహదారిపై విశాఖ డెయిరీ సమీపంలోని సర్వీస్ రోడ్డులో గల పండ్ల దుకాణంలో సహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఆరేళ్ల క్రితం పెళ్లయిన ప్రవీణ్‌కు భార్య, 3, 4 ఏళ్ల వయసు గల ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. దంపతులిద్దరూ గత కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. శనివారం రాత్రి కూడా ఇద్దరూ గొడవ పడినట్టు స్థానికులు చెబుతున్నారు. కాగా ఆదివారం ఉదయం డెయిరీ సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న కొంతమంది పండ్ల దుకాణాల వద్ద ప్రవీణ్ ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రవీణ్ భార్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని విలపించారు. ప్రవీణ్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సీతారాముల పరస

వేపగుంట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు పరిధి ఆర్ఆర్‌వీ పురంలో సీతారాముల పరసను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని సీతారాములకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేసి సీతారాములను దర్శించుకుని పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మార్చి 13న ముత్యాలమ్మ పండగ

వేపగుంట పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ పండగను మార్చి 13న నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. స్థానిక రామాలయంలో నిర్వహించిన సమావేశంలో పండగకు భారీ ఏర్పాట్లు చేయాలని, పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానించాలని నిర్ణయించారు. సమావేశంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, గ్రామ పెద్ద ముత్తానాయుడు, అర్చకులు శేషాద్రి శర్మ, కూటమి నాయకులు పిన్నింటి పార్వతి, మామిడి కిరణ్, కృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల మక్కువ చూపాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల పట్ల మక్కువ చూపాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. క్రీడల అభివృద్ధి కోసం, మంచి క్రీడాకారులను తయారుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. మొల్లివానిపాలెం జీవీఎంసీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎస్‌పీఎం క్రికెట్ ప్రీమియం లీగ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగులు, గంజాయి, మద్యం, ఇతర మత్తు పదార్థాల జోలికి పోవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, కూటమి నాయకులు పెంటిరాజు, కిలాని ముసలయ్య, శ్రీముసిరి శ్రీనివాసరావు రవీంద్ర, రమణ, రమేశ్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బీఎంఎస్ ప్లాంట్ నాయకులు కోరారు. విశాఖ విచ్చేసిన మంత్రిని ఆదివారం నగరంలో నాయకులు కలిసి పలు సమస్యలను విన్నవించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బీఎంఎస్ నాయకులు జెర్రిపోతుల రమణ, కొమ్మినేని శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

పీఎఫ్ సమస్యను పరిష్కరించాలంటూ..

అక్కిరెడ్డిపాలెం: భెల్ హెచ్‌పీవీపీలో పలువురు కార్మికుల సర్వీస్ రికార్డులో పీఎఫ్ నమోదులో ఏర్పడిన తప్పులను సవరించి న్యాయం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు గుర్తింపు కార్మిక సంఘ నాయకులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. బీహెచ్‌పీవీలో 1992, 1997లలో చేరిన ఆర్-సిరీస్, టీ-సిరీస్ కార్మికులకు పీఎఫ్ కట్ చేసినప్పటికీ 2011 నుంచి మాత్రమే వసూలైనట్టు నమోదయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సుమారు వంద మంది కార్మికులు నష్టపోతారని, అందువల్ల న్యాయం చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. భెల్ యాజమాన్యంతో చర్చించి త్వరలో న్యాయం చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రిని కలసిన వారిలో నాయకులు ఎస్.సాహూ, బి.బాబూరావు, కొల్లి దేముడు, రాజు, భాస్కరరావు, రవీంద్రబాబు, వెంకటరావు తదితరులు ఉన్నారు.

'అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తా'

పెందుర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం సర్వే నంబర్-36లో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తహశీల్దార్, ప్లానింగ్ కార్యాలయాల్లో వేర్వేరుగా ఫిర్యాదు చేయనున్నట్టు టీడీపీ పెందుర్తి నియోజకవర్గ యువజన అధ్యక్షుడు శ్రీను యాదవ్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అక్ర నిర్మాణం పైభాగంలో ఆదివారం సెలవు కాబట్టి పట్టణ ప్రణాళికా విభాగం అనుమతులు లేకుండానే అదనపు షెడ్డను నిర్మించారన్నారు. వైసీపీ నాయకుడి అండదండలతో ఈ అక్రమ నిర్మాణం జరుగుతుందని ఆయన ఆరోపించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో 1990-91 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ తమ కుటుంబ సభ్యులతో హాజరవ్వడంతో ఆత్మీయ సమ్మేళనానికి వేదికైన దుర్గమాంబ ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఒకరికొకరు అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించడంతో పాటు ఆర్మీలో విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ చేసిన తమ మిత్రుడు కంపర శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాండ్రేగుల జగ్గారావు, బొండా శంకర్రావు, పి.అప్పలరాజు, కె.చినతల్లి, బి.భవాని, కె.అప్పలరాజు, కె.రాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనగర్‌లో స్వచ్ఛ భారత్



పార్కును శుభ్రం చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వల్ల అంటురోగాలు దరి చేరవని తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, విశ్వేశ్వరరావులు అన్నారు. 87వ వార్డు పరిధి తిరుమలనగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్, తదితర ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ బాధ్యతగా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలుష్య నివారణ కోసం విధిగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పరమానందం, పరమేశ్వరరావు, మూర్తి, సన్యాసిరావు, వసంత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

ఆటోనగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి చట్టివాని పాలెం ఆలయ సముదా యంలోని సూర్య భగవానుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో పంచామృతాభిషేకాలు, అర్చనలు, నవగ్రహ పూజలు జరిపారు. పరమాన్నాన్ని చిక్కుడు ఆకులలో ఉంచి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పలువురు భక్తులు నవగ్రహ స్తోత్రాలను, ఆదిత్య హృదయాన్ని పఠించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

పెదగంట్యాడ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంలోని శివరామకృష్ణ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఐదు గంటల నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రసాద వితరణ చేపట్టనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగే కోలాటం, తప్పెటగుళ్ళు, సాముగారిడీ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయిలను సత్కరించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం వార్షికోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టరును వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రతినిధులు నక్కా దుర్గబాబు, పల్లా హరి, నమ్మి అప్పారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శిథిల భవనాలను తొలగించాలి

అగనంపూడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి కూడలికి సమీపంలో శిథిలావస్థలో ఉన్న పాత పంచాయతీ భవనాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ శిథిల భవనాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయన్నారు. నిత్యం ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఏరియా ఆస్పత్రికి అనుకుని ఉన్న ఈ శిథిల భవనాలను తక్షణమే తొగించి పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ పార్కును ఏర్పాటు చేస్తే అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆ దిశగా జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 44, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 38, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ (పె)6, అల్లం (పాతది) 52, మునక్కాడలు (కిలో) 70, బరబాటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 120, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 28, కీరదోస 30, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడ దుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 36, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	65
లైవ్ ధర	85
విత్ స్కిన్	140
స్కిన్‌లెస్	150



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి

పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

గాజువాక, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో కూటమి ప్రభుత్వం మద్దతు ఇస్తున్న ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించవలసిందిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరారు. ఆదివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో టీచర్స్ యూనియన్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రఘువర్మకు ఉపాధ్యాయులందరూ తొలి ప్రాధాన్యం ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకువస్తున్నారని పేర్కొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం గౌరవంగా చూస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిం చేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారన్నారు. సమావేశంలో జిప్సా గౌరవ అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, షణ్ముఖరావు, ప్రసాదుల శ్రీనివాసరావు, నల్లూరు సూర్యనారాయణ, గోమాడ వాసు, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పాకలపాటి రఘువర్మను గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కోరారు. 87వ వార్డు పరిధి శ్రీగణేశ్ నగర్‌లో ఉపాధ్యాయుల వద్దకు ఆయన వెళ్లి రఘువర్మకు తొలి ప్రాధాన్యం ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, ఎం.రాము, శ్రీను, ఉపాధ్యాయులు మన్నాజీ, నారాయణరావు, రామశేషు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ సిటీ లారీ ఓనర్స్ నూతన కార్యవర్గం



స్టీల్ సిటీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గాజువాక స్టీల్ సిటీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం 86వ పరిధి వార్డు రాజీవ్‌నగర్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేసారపు శ్రీను రమేశ్, ఉపాధ్యక్షుడిగా నెల్లి శ్రీనివాసరావు, కార్యదర్శిగా సాలాపు శ్రీనివాసరావు, కోశాధికారిగా గొల్లవిల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా సాలాపు తాతారావు, కో జాయింట్ సెక్రటరీగా ఎస్.రమణ, కో-ట్రెజరర్‌గా జి.కన్నారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బత్తిన గణేశ్, బంటు రమణలు ఎన్నికయ్యారు. అలాగే సభ్యులుగా నానాజీ, దేముడు, దుర్గారావు, రాజు, అప్పారావు, సూరిబాబు, శ్రీను, సతీశ్, ఈశ్వరరావు, అప్పలరాజు, వెంకటరావు, రాజు, తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీను రమేశ్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలి

తూర్పు నౌకాదళ కెప్టెన్ రాజారవి సనత్‌కుమార్



మాట్లాడుతున్న రాజారవి సనత్‌కుమార్

మల్కాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యువతులు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని, సమాజానికి మహిళల పట్ల ఉన్న చిన్నచూపును మార్చాలని భారత తూర్పు నౌకాదళ కెప్టెన్ రాజారవి సనత్‌కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సీనియర్ విద్యార్థినులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ దిశ యాప్‌ను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డిప్యూటీ మేనేజర్ ఎస్.ఉమామహేశ్వరరావు, పోలా శ్రీనివాసరావు, అనిల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ్‌కుమారి, కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, తదితరులు పాల్గొన్నారు. మిస్ సెంటాన్స్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే ప్రతిభ గల విద్యార్థినులకు బహుమతులు అందజేయడంతో పాటు రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్ పి.దివ్యశ్రీని సత్కరించారు.

స్టీల్‌ప్లాంటులో ఒకే సంఘంగా టీఎన్‌టీయూసీ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో తెలుగుదేశం పార్టీ అనుబంధ టీఎన్‌టీయూసీ అధ్యక్షునిగా గుమ్మడి నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శిగా నమ్మి సింహాద్రిలను గుర్తించి. ప్రచారం చేయాలని పేర్కొంటూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు లేఖ వ్రాసారు. టీఎన్‌టీయూసీ పేరుతో కొంత మంది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని తప్పుద్రోవ పట్టిస్తున్నారనే సమాచారం ఉందని పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాల్లో టీఎన్‌టీయూసీ గుర్తించాలని లేఖలో పేర్కొన్నారు.

26న స్టీల్ క్లబ్‌లో మహా శివరాత్రి ఉత్సవాలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ క్లబ్‌లో ఈ 26న మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తి గీతాలాపాన, నృత్య ప్రదర్శనలు వంటివి ఉంటాయని, అందువల్ల క్లబ్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

విద్యా వికాస కేంద్ర నిర్వాహకులకు శిక్షణ

పెందుర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో కైట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో ఆదివారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలో గల 30 గ్రామాల్లో నిర్వహిస్తున్న విద్యా వికాస కేంద్ర నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్య, సంప్రదాయం, అక్షరాస్యత పెంపు వంటి అంశాలపై శిక్షణనిచ్చారు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు మాట్లాడుతూ విద్యా వికాస కేంద్రాలతో గ్రామాల్లో శత శాతం అక్షరాస్యత సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజరు ప్రశాంత్, జిల్లా సమన్వయకర్తలు వనజ, గౌరీనాయుడు, ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.